# Department of Zoology, Government Degree College Kalyandurg

## Achievements of G L N Prasad

# యువతలో కొరవడుతున్న భాషానైపుణ్యాలు

ప్రపంచమంతా భౌగోళిక కుగ్రామంగా మారిపోయిన ప్రస్తుత యుగంలో మనిషి మనుగడ కేవలం సమాచార మార్పిడి మీదనే ఆధారపడి ఉంది. ఈ సమాచార మార్పిడి సమర్థవంతంగా జరగాలంటే భాషా నైపుణ్యాలు ఎంతో అవసరం. సృష్టిలో ఉన్న జీవ జాలంలో మానవుడు మాత్రమే ప్రత్యేకమైన భాషా నైపుణ్యాలను కలిగిఉన్నాడు. మానవుడికి ఉన్న సంభాషణాచాతుర్యం ఇక ఏ ఇతర జీవికీ లేదు. మిగిలిన జంతువుల సమాచార మార్పిడి అసమగ్రంగా ఉంటుంది. ఉదాహరణకు సృష్టిలోని ఏ జంతువైనా కూడా నాకు ప్రస్తుతం ఆకలిగా ఉంది అని చెప్పగలదు. కానీ మానవుడు ఒక్కడే నాకు నిన్న కూడా ఆకలిగా ఉండింది అని చెప్పగలడు. మానవుడిలో స్వరపేటిక నిర్మాణం, మెదడు నిర్మాణం ఉత్కృష్ట స్థాయిలో ఉండడం వలన అనేక శబ్ద విన్యాసాలతో కూడిన భాషను అభివృద్ధి చేసుకోగలిగాడు. తన భావోద్వేగాలను చక్కగా వ్యక్తపరచడానికి అనుగుణంగా భాషను, తదనంతర కాలంలో లిపిని అభివృద్ధి పరుచుకున్నాడు. బొమ్మల ద్వారా, ఇతర సంకేతాల ద్వారా తన భావాలను వ్యక్తపరచడం నేర్చుకున్నాడు. తను మాట్లాడే భాషకు వ్యాకరణాన్ని తయారుచేసుకున్నాడు. జీవపరిణామ క్రమంలో బొటనవేలు నిర్మాణంలో వచ్చిన మార్పు, పుర్రెలోని ఎముకలు, దవడల నిర్మాణంలో వచ్చిన గుణాత్మక మార్పుల వలన శబ్దోచ్చారణలో, చేతి రాతలో వివిధ మెళకువలను మానవుడు అలవరచుకున్నాడు. ముఖ్యంగా భారతీయ భాషల వర్ణమాలలోని ప్రతి అక్షరం వెనుక ఒక శబ్ద శక్తి దాగి ఉంది అనే విషయం అందరికీ తెలిసిందే. మధ్యమా, వైఖరీ, పరా, పశ్యంతి రూపాలుగా పర్యవసానం చెందుతూ స్వరం భాషకు ఒక సంగీత లక్షణాన్ని ఆపాదించింది. స్వరం ఉదాత్తమై, అనుదాత్తమై వేదంలో ధ్వనించింది. ఇలా మానవ పరిణామ క్రమంలో శబ్ద బ్రహ్మగా, నాద బ్రహ్మగా భాష తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. ఇలా వేద కాలానికే మాట మంత్రమై నిలిచింది. తరువాత భాషా సాహిత్యాలు ఉద్భవించాయి. పురాణాలు, ఇతిహాసాలు, ప్రబంధాల రూపాలలో భాష బహుముఖంగా వర్ధిల్లింది. జానపద భాష నుంచి క్రమంగా పండిత భాష ఉద్భవించింది. ప్రతి రంగంలో నెమ్మదిగా పారిభాషక పదకోశాలు ఏర్పడ్డాయి. భాషా సాహిత్యాలు ఇంత స్థాయిలో సమున్నతంగా వెలుగొందడానికి వెనుక కొన్ని వేల సంవత్సరాల శ్రమ ఉంది. ఇంత శ్రమకోర్చి పోగుచేసుకున్న భాషా సంపదని, సాహిత్యాన్ని ఈ కాలం యువత కాపాడుకోలేక పోతోందని చెప్పవచ్చు. సాహిత్యానికి విలువలేని సమాజంలో మనం కొనసాగుతున్నాం. యువతకు సాంకేతికత మీద ఉన్న మోజు సాహిత్యం మీద లేదు. ప్రస్తుతం చాలా మంది విద్యార్థులకు కనిష్ఠ స్థాయిలో కూడా భాషా నైపుణ్యాలు ఉండడం లేదు. సంభాషణా నైపుణ్యాలు కొరవడడంతో తమ భావోద్వేగాలను ఎలా ప్రకటించాలో తెలియక సతమతమవుతున్నారు. ఇటీవలి కాలంలో ఉన్నత చదువులు చదువుకున్న వారికి సైతం కనీస భాషా జ్ఞానం కరువవుతూ ఉండడం శోచనీయం. దీనికంతటికీ కారణం వివిధ స్థాయిలలో జరుగుతున్న విద్యా బోధనలో భాషా శాస్త్రాలకు తగిన ప్రామాణిక స్థాయిని కల్పించకపోవడమే. ఎప్పుడైతే విద్య ఒక అంగడి సరుకుగా మారిందో, వాణి విపణి వీధికి తరలి పోయిందో, ఆనాడే భాషా వైభవం నశించడం మొదలయ్యిందని చెప్పవచ్చు. భాషా వైభవం ఎప్పుడైతే అడుగంటిందో, అప్పుడే దానితో సంబంధం ఉన్న చరిత్ర, సంస్కృతి కూడా తమ పూర్వ ప్రాభవాన్ని కోల్పోయాయి. విద్యాభ్యాసంలో ఏ స్థాయిలో కూడా భాషా బోధన సక్రమంగా జరగకపోవడం వలన ప్రస్తుతం యువతకు భాష మీద సాధికారత పోయింది. భాష మీద సాధికారత పోవడం మూలాన భావోద్వేగాల మీద నియంత్రణ కూడా పోయింది. మానవ సంబంధాలను కలిపి ఉంచే బంధం భాష. అలాంటి భాష మీద మనం పట్టు కోల్పోతే, మానవ సంబంధాలు మసకబారి పోతాయి. మరి ఈ కాలంలో యువత భాషా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలంటే తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చిద్దాం.



ప్రతి విద్యార్థి కళాశాల స్థాయిలోనే ఒక ప్రాంతీయ భాషను, జాతీయ భాషను అదే విధంగా ఆంగ్ల భాషను ప్రత్యేక శ్రద్ధతో అధ్యయనం చేయాలి. రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్, రామకృష్ణ మిషన్ లాంటి సంస్థలు అంతర్జాతీయ భాషలలో కూడా విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. అలాంటి వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయి. శతక సాహిత్యాన్ని ఔపాసన పడితే మేనేజ్మెంట్ సూత్రాలను ఆకళింపు చేసుకున్నట్టే అనే విషయం మరిచిపోకూడదు. శతక సాహిత్యంలో మానవ మనోవిజ్ఞాన రహస్యాలన్నీ ఇమిడిఉన్నాయి. ప్రబంధ సాహిత్యం చదవడం వలన సౌందర్యోపాసన ఆరోగ్యకరమైన రీతిలో అభివృద్ధి చెందుతుంది. జీవితాన్ని సౌందర్య లహరిగా, ఆనంద లహరిగా మార్చుకోవాలనుకునేవారు ప్రబంధ సాహిత్యాన్ని అధ్యయనం చేయవచ్చు. ప్రాచీన శాసన భాషను కూడా చదవడం నేర్చుకున్న వారికి మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయి.

ప్రతి కళాశాలకు అనుబంధంగా ఉన్న లైబ్రరీలలో భాషా సాహిత్యాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉండాలి. సాహిత్యానికి సంబంధించిన సదస్సులు, వెబినార్లు నిర్వహించడం పట్ల అధ్యాపకులు మొగ్గు చూపాలి. అన్ని రకాల వర్గ సాహిత్యాలను విద్యార్థులకు పరిచయం చేసే ప్రయత్నం చేయాలి. ప్రతి రంగానికి చెందిన పారిభాషక పదకోశాన్ని విద్యావేత్తలు రూపొందించాలి. ఏ భాష అయినా అంతరించిపోతే, దానితో పెనవేసుకున్న ఎంతో సంస్కృతి మరుగున పడిపోతుంది. భాషా సంస్కృతులు నాశనమైతే, ఆ జాతి నిర్వీర్యమై పోతుంది. ఒక భాష రూపొందాలి అంటే దాని వెనుక కొన్ని తరాల శ్రమ ఉంటుందనే విషయం మనమెవ్వరం మరిచిపోకూడదు. ఈ భాషా పరమైన వారసత్వ సంపదను ఏ జాతీ, ఏ దేశం కోల్పోకూడదు. చిత్తూరు జిల్లాలోని యుద్ధగళ తీర్థం, కర్నూల్ జిల్లాలోని కేతవరం గుహలు, అలాగే తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతాలలోని ఆది మానవుల చిత్ర సంజ్ఞలను సందర్శిస్తే భాషను, లిపిని అభివృద్ధిని చేసుకోవడానికి ఆనాటి వారు ఎంత శ్రమించారో మన విద్యార్థులకు తెలిసివస్తుంది. తద్వారా తమ భాషను, సంస్కృతిని కాపాడుకోవాలనే తపన వారిలో కలుగుతుంది.

విద్యార్థి దశ నుంచే ఉచ్చారణా సంబంధ దోషాలను సరిచేసుకునే ప్రయత్నం చేయాలి. పామర భాషను, పండిత భాషను తులనాత్మకంగా అధ్యయనం చేసి రెండిటినీ కాపాడుకోవాలి. జానపద సాహిత్య సంపదను కోల్పోతే జాతి ఎంతో వారసత్వ సంపదను కోల్పోతుంది. నేటి వైద్య శాస్త్రం కూడా ఆశ్చర్యపోయే మూలికల గురించి విలువైన సమాచారం జానపద సాహిత్యంలో ఉన్నాయనే విషయం మనం మరవకూడదు. ప్రతి ఒక్క విద్యార్థి తన భాషా సంపదను పరిపుష్టం చేసుకోవాలి.

జీవితంలో విజయం సాధించాలి అంటే వాక్శుద్ధి, వాక్ సిద్ధి రెండూ అవసరమే. భాషను సమర్థవంతంగా వినియోగించ గలిగితేనే విజయానికి చేరువవుతాము. సంభాషణా చాతుర్యంతో పాటు రచనా సామర్థ్యాన్ని కూడా యువత అలవాటు చేసుకోవాలి. చేతి రాత మీద విద్యార్థులు సరైన శ్రద్ధ చూపడం లేదనేది బాధాకరమైన వాస్తవం. చేతి రాత బాగుంటే తల రాత బాగుంటుంది అనేది అక్షరాలా నిజం. రాయడం వలన చేతి కండరాలు బలపడడంతో పాటు, మేధస్సు కూడా వికసిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఒక విద్యార్థి భాషా నైపుణ్యాలు మెరుగుపరచడంలో కుటుంబ సభ్యుల పాత్ర కూడా ఎక్కువగానే ఉంటుంది. తమ పిల్లలు సైన్సుతో పాటుగా సాహిత్యాన్ని కూడా చదివేలా తల్లి తండ్రులు ప్రోత్సహించాలి.

అలాగే తల్లి భాష పట్ల మక్కువ పర భాషా ద్వేషానికి దారితీయకుండా జాగ్రత్త పడాలి. సంస్కృతం, ఆంగ్ల భాషల మీద సాధికారత సంపాదించిన యువత అన్ని రంగాలలో రాణిస్తుంది కాబట్టి భాషా శాస్త్రాలను సుసంపన్నం చేసుకునే దిశగా విద్యావేత్తలు ప్రణాళికలు రూపొందించాలి. భాషా సాహిత్యాల మీద పట్టు సంపాదించడం ద్వారానే బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోగలమనే విషయాన్ని విద్యార్థులు గమనించాలి.

- జి.ఎల్.ఎన్. ప్రసాద్
9441450987

లోకి వచ్చిందని చెప్పుకోగలమో అలాంటి వారిని

◆ శీలోజు యాదగిరి 9440222914

# డిజిటలైజేషన్‌తో సృజనాత్మకతకు ప్రమాదం




విద్యా వైద్యరంగాలలో విస్తృతమైన పరిశోధనలు జరుగుతున్న తరుణం ఇది. గురువు పాత్రను గూగుల్ ఆక్రమించుకుంటున్న సమయమిది. నల్లబోర్డు స్థానంలో డిజిటల్ బోర్డ్సు వచ్చి తిష్ట వేశాయి. కళాశాలలను మిద్యా తరగతులు వశపరుచుకున్నాయి. సుద్ద ముక్కను ఉపయోగించి పాఠం చెప్పడం నామోషీగా భావించే కాలంలో మనం అందరం ఉన్నాము. పవర్ పాయింట్ పద్ధతుల ద్వారా జాతీయ, అంతర్జాతీయ సదస్సులను మేధావులు కాలెత్తిస్తున్నారు. విద్యార్థులందరూ డిజిటల్ వేదికల ద్వారా గురువు అవసరం లేకుండా విద్యను అభ్యసిస్తున్నారు. ఆధునిక విద్య అంటే కేవలం డిజిటల్ బోధనే అనే అపోహలో విషయ నిపుణులు ఉన్నారు. ఇప్పటి విద్యావ్యవస్థలో గురువు ఒక అవశేషావయం. ఆయన భౌతికమైన ఉనికితో పనిలేనట్టి ఏకలవ్య శిష్యులు పుట్టుకొస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం వల్ల విద్యా వ్యవస్థకు జరుగుతున్న లాభనష్టాలను తులనాత్మకంగా బేరీజు వేసే ప్రయత్నం చేద్దాము.

కంప్యూటర్స్ కనిపెట్టడానికి ముందు తరం గురువులు తరగతిలోకి ప్రవేశించడానికి ముందు తగురీతిలో విషయ సేకరణ చేసేవారు. గురువు ఆంగికం, ఆహార్యం, వాచికం అన్నీ కూడా విద్యార్థి మీద ప్రభావం చూపేవి. అందుకే ఆనాటి గురువులు ఆదర్శప్రాయంగా నిలిచిపోయారు. బొమ్మ గీసే విధానం బోధనలో అంతర్భాగంగా నేర్పించేవారు. ఒక పదాన్ని ఎక్కడ ఒత్తి పలకాలి, ఎక్కడ దీర్ఘం తీసి పలకాలి అనే అంశం అప్పట్లో గురువు ఉచ్చారణను అనుసరించి నేర్చుకునేవారు. గురువు ప్రతి అంశంలో బోధనకు ప్రమాణంగా వుండేవారు.

తరగతి గదిలో సంప్రదాయ బోధనలో వ్యక్తిగత శ్రద్ధ గురువు పెట్టగలిగే వాడు. విద్యార్థుల స్థాయిని బట్టి విద్యార్థి దిగజారి పోకుండా గురువు ఎంతవరకైనా దిగివచ్చే సౌలభ్యం సంప్రదాయక తరగతి గదిలో ఉండేది. విద్యార్థి మానసిక స్థాయి, ఆర్థిక స్థాయి, కుటుంబ నేపథ్యం గురువుకు కూలంకషంగా తెలిసేది. దానిని బట్టి బోధన తీరు తెన్ను మార్చుకోగల నైపుణ్యం గురువులకు ఉండేది. పాత్ర ఔచిత్యాలను, యోగ్యతాయోగ్యతలను పరిశీలించి గురువులు బోధించేవారు. విద్యను వివాదాల కోసం ఉపయోగించేవారు కాదు. సమాజ శ్రేయస్సుకు మాత్రమే జ్ఞానాన్ని ఉపయోగించేవారు. గురువు సాన్నిహిత్యం విద్యార్థిలో మేధస్సుతో పాటుగా హృదయ పరివర్తనను తీసుకుని వచ్చేది. అప్పటి గురువులు సమాచారంతో పాటుగా సంస్కారాన్ని కూడా అందజేసేవారు. ఇప్పటి డిజిటల్ వేదికలో లభ్యమవుతున్న అంతులేని సమాచారం విద్యార్థిని వొత్తిడికి గురిచేస్తున్నది. ఏది చదవాలో, ఏది వదిలేయాలో తెలియక, తీరం కనపడని పడవ సముద్రంలో వూగిసలాడినట్టు విద్యార్థి సిలబస్‌తో కుస్తీ పడుతున్నాడు. ఈ రోజు నేర్చుకున్న విద్య లేదా నైపుణ్యం రేపటికి ఎందుకూ పనికిరానిదిగా మారిపోతున్నది. అనుక్షణం మారే వెర్షన్‌లతో డిజిటల్ విద్యార్థి పెనుగులాడుతున్నాడు. డిజిటల్ గురువులు కూడా కొత్తగా బావుకున్నది ఏమీలేదు. వారికి కూడా ప్రతి రోజు పోరాటమే. రోజు వారి అప్‌డేట్స్‌ను సరిపోల్చుకుంటూ బోధనాంశాలతో పాపం గురువులు కుదేలవుతున్నారు. గూగుల్లో కనిపిస్తున్న సమాచారానికి తల ఏదో....తోక ఏదో తెలియక గురుశిష్యులు తికమక పడుతున్నారు. సంప్రదాయక తరగతి గదిలో నిర్దిష్ట వేళలో బోధన జరిగేది కాబట్టి, విద్యార్థులకు క్రమశిక్షణ అలవాటు అయ్యేది. కోర్స్ పూర్తి అయ్యేంతలో సమయపాలన అలవాటు అయ్యేది. ఇప్పుడు గూగుల్ గురువులు అంతర్జాలం లో హల్‌చల్ చేస్తూ 'నెట్టింట్లో' నుంచి 'నట్టింట్లోకి' దూసుకు వస్తున్నారు. దీని వల్ల ఒక విషయాన్ని ఎప్పుడైనా నేర్చుకోవచ్చులే అనే అలసత్వం విద్యార్థికి కలుగుతుంది. సమయపాలన మీద పట్టుపోతుంది. పూర్వం తరగతి గదిలో ప్రశ్నలకు వ్యక్తిగతంగా విద్యార్థి స్థాయిని బట్టి గురువు నుంచి సమాధానాలు లభ్యమయ్యేవి. ఇప్పుడు అలా కాదు ......ప్రశ్నకు తగ్గ సమాధానం, సరైన సమయంలో సరైన విధంగా డిజిటల్ వేదికలు ఇవ్వడం లేదు. బాధకు తగ్గ బోధ డిజిటల్ మాధ్యమాలు చేయడం లేదు. డిజిటల్ బోధనలో సన్నివేశ ప్రాధాన్యత, సందర్భ శుద్ధి కచ్చితంగా లోపిస్తాయి. మీట నొక్కితే చాలు గూగుల్‌లో ఇబ్బడి ముబ్బడిగా వచ్చి పడుతున్న సమాచారంలో ఏది తనకు అవసరమో తెలుసుకోలేక డిజిటల్ విద్యార్థి బెంబేలెత్తుతున్నాడు. సంప్రదాయ బోధనలో గురువు హంసలాగా క్షీర నీర న్యాయాన్ని అనుసరించి,

> **విద్యా సంబంధ విషయాలతో పాటు తెర మీద స్క్రోల్ అయ్యే వ్యాపార ప్రకటనలు విద్యార్థులను అమితంగా ఆకర్షిస్తాయి. వీటివల్ల విద్యార్థులకు అనవసర విషయాల పట్ల ఆసక్తి పెరిగి ఏకాగ్రత దెబ్బతినే ప్రమాదం ఉంది. సంప్రదాయ విద్యలో ఈ అవకాశం లేదు. డిజిటల్ విద్య విద్యార్థి ని ఎంత తొందరగా బాగుపరచగలిగినా కూడా, ఏమరు పాటుగా ఉంటే అధఃపాతాళానికి దిగజారుస్తుంది అనేది వాస్తవం.**




అవసరమైన సమాచారాన్ని మాత్రమే శిష్యులకు అందించేవాడు. అవసరమైన సమాచారం ఎంత మేలుచేస్తుందో, అవసరం లేని సమాచారం అంతే కీడు చేస్తుందనే విషయాన్ని డిజిటల్ మాధ్యమాలు పట్టించుకోవు. వాటి దృష్టిలో విద్యార్థి కేవలం వినియోగదారుడు మాత్రమే.

సంప్రదాయ తరగతి గదిలో విద్యార్థులు పరస్పరం సమాచార మార్పిడి చేసుకోవడం వల్ల, వారికి సామాజిక స్పృహతో పాటు ఇతరుల అభిప్రాయాలను గౌరవించే మనస్తత్వం అలవడుతుంది. ఒక వేళ, విభేదించినా కూడా దానిలో ఉదాత్తత ఉండేలా చూసుకునే సామర్థ్యం అలవడుతుంది. సామాజిక నైపుణ్యాలు పదిమందితో కలిసి విద్య నేర్చుకోవడం వల్ల, విద్యార్థులకు తొందరగా పట్టుబడతాయి. కానీ ఇప్పటి డిజిటల్ తరగతిలో ప్రతి విద్యార్థి ఒక ద్వీపంలాగ తయారవుతున్నాడు. విద్యార్థికి, విద్యార్థికి మధ్యలో గోడలు లేపడంలో డిజిటల్ తరగతులు విజయం సాధించాయి. డిజిటల్ నైపుణ్యాలు పుణికి పుచ్చుకున్న విద్యార్థులలో సామాజిక నైపుణ్యాలు లోపిస్తున్నాయనే విషయాన్ని ఎన్నో సర్వేలు తేల్చాయి. ఈ డిజిటల్ యుగం విద్యార్థులలో సామాజిక అభద్రత మోతాదు మించిపోయి ఆత్మహత్యల శాతం పెరిగిపోయింది అని చాలా మంది అభిప్రాయం.

డిజిటల్ విద్యా వ్యవస్థలో విద్యార్థి మానసిక ఆరోగ్యమే కాకుండా, శారీరక ఆరోగ్యం కూడా దెబ్బ తింటుంది. చాలా మంది విద్యార్థులు టచ్ స్క్రీన్ రుద్దుకుంటూ గడపడం వల్ల వేళ్ళు దెబ్బతిని పెన్సిల్ గానీ, పెన్ను గానీ పట్టుకోలేని స్థితిలో ఉన్నారు. కంటికి సంబంధించిన సమస్యలు విద్యార్థులలో ఎక్కువవుతున్నాయి. తలవంచి ఎక్కువ గంటలు ట్యాబ్‌ను చూడడం వల్ల వెన్నముకకు సంబంధించిన సమస్యలు అటు గురువుల లోను, ఇటు విద్యార్థుల లోను తలెత్తుతున్నాయి. డిజిటల్ విద్యార్థులు మానిటర్‌లతో తప్ప మనుషులతో మాట్లాడడం లేదు. డిజిటల్ విద్యార్థులలో బృంద నైపుణ్యాలు మృగ్యమవుతున్నాయి.

డిజిటల్ విద్యతో ఖర్చు తగ్గుతుంది అనుకోవడం కూడా అపోహ. అనుక్షణం మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి,మార్కెట్‌లోకి దూసుకొస్తున్న కొత్త ట్యాబ్‌లను, కంప్యూటర్స్‌ను కొనడానికి బోలెడంత డబ్బు తగలేయాల్సిందే కదా! అప్‌డేట్ చేసుకోవాలంటే ప్లే స్టోర్‌లో రుసుము చెల్లించి తీరాల్సిందే! తరగతి గదిలో పెరుగుతున్న సెల్‌ఫోన్ దొంగతనాలు విద్యార్థుల నైతిక విలువలను ప్రశ్నార్థకంగా మారుస్నాయి. సంప్రదాయ తరగతి గదిలో విద్యార్థి అతి తక్కువ అవసరాలతో బతికేవాడు. ఇప్పుడు మారుతున్న సెల్‌ఫోన్స్ మోడల్స్ వల్ల, విద్యార్థులలో ఆర్థిక సంబంధమైన అంతరాలు కొట్టొచ్చినట్టు కనబడి ఈర్ష్యాద్వేషాలు కూడా పెరుగు తున్నాయి. డిజిటల్ బోధనలో కట్.....కాపీ....పేస్ట్ సంస్కృతి పెరిగిపోయి, గురువులు, విద్యార్థులలో సృజనాత్మకత మందగిస్తున్నది. పరిశోధక విద్యార్థులు కూడా విశేషమైన గ్రంథ చౌర్యానికి పాల్పడుతున్నారు. ప్లాజియరిజం సాఫ్ట్‌వేర్ వల్ల కొద్దిగా ఈ పోకడకు అడ్డుకట్ట వేయగలిగినా కూడా విద్యార్థులలో ఆ గ్రంథ చౌర్య సంస్కృతి పూర్తిగా నశించడం లేదు.

పిల్లలు కదలకుండా ట్యాబ్, కంప్యూటర్ ముందు కూచోవడం వల్ల వారిలో స్థూలకాయం వస్తున్నది. కేవలం మీట నొక్కడానికి మాత్రమే చిన్నారుల వేళ్ళు అలవాటు పడడం వల్ల చేతిరాత దెబ్బతింటున్నది అని నిపుణులు అంటున్నారు. చేతిరాత మనిషి తలరాతను నిర్ణయిస్తుంది అని పెద్దలనే వారు. చేతిరాత వల్ల మెదడులో ప్రవించబడే రసాయనాల మోతాదులో మార్పు సహజంగా వస్తుంది. ఇది విద్యార్థిలో మానసిక పరిపక్వతను తీసుకుని వచ్చేది. డిజిటల్ విద్యార్థులకు ఈ సౌకర్యం ఇక అందుబాటులో ఉండదు. వారి జీవితాన్ని నిర్ధారించేది ఇప్పుడు సుద్ద ముక్క కాదు......జాయ్ స్టిక్ మరి.

డిజిటల్ మాధ్యమంలో విద్యార్థులు తమ కళాశాలలోని గురువుల బోధన వినకుండా ఎక్కడో భూగోళానికి అవతల వైపు కూచున్న గురువు పాఠాన్ని ఆసక్తిగా వినే అవకాశం ఉంది. దీని వలన తమ గురువుల పట్ల చులకన భావం విద్యార్థిలో కలగవచ్చు. ఇంటి పెరటి చెట్టు లాగా గురువుల విలువ పడిపోతోంది. దీని వలన గురువుల ఆత్మస్థైర్యం దెబ్బతినవచ్చు. పోనీ అవతలి వ్యక్తి నాణ్యమైన విద్యను బోధిస్తాడా అంటే అది కూడా ప్రశ్నార్థకమే. విదేశీ గురువుల బోధన వల్ల స్వదేశీ సంస్కృతి పట్ల గౌరవం సన్నగిల్ల వచ్చు.

గూగుల్ వేదికలు మార్కెట్ లో డిమాండ్ ఉన్న అంశాలనే బోధిస్తాయి. విద్యార్థికి దీనివల్ల స్టాక్ మార్కెట్ కిటుకులు పట్టుబడవచ్చు. కానీ వారిలో మానవీయ కోణం కచ్చితంగా మరణిస్తుంది. విద్యార్థి జీవితం డిజిటల్ విద్యా వేదికలలో అంగడి సరుకుగా మారే అవకాశం ఉంది. గురుశిష్య సంబంధాలు వ్యాపార సంబంధాలుగా రూపాంతరం చెందుతాయి. కుటుంబ విలువలు అడుగంటుతాయి. విద్యార్థులలో వస్తు వ్యామోహం పెరుగుతుంది. భోగలాలసత పెరిగి ఒక తరం, తగు జాగ్రత్తలు తీసుకోని పక్షంలో నిర్వీర్యం అయ్యే అవకాశం ఉంది. సమాచారానికి, సంస్కృతికి మధ్య వైరుధ్యంతో పాటు వైషమ్యం కూడా పొడచూపుతుంది. ఇక డిజిటల్ విద్యార్థి తన మేధస్సుతో ఆలోచించడు.......అరువు తెచ్చుకున్న విదేశీ మెదడుతో ఆలోచిస్తాడు.

విద్యా సంబంధ విషయాలతో పాటు తెర మీద స్క్రోల్ అయ్యే వ్యాపార ప్రకటనలు విద్యార్థులను అమితంగా ఆకర్షిస్తాయి. వీటివల్ల విద్యార్థులకు అనవసర విషయాల పట్ల ఆసక్తి పెరిగి ఏకాగ్రత దెబ్బతినే ప్రమాదం ఉంది. సంప్రదాయ విద్యలో ఈ అవకాశం లేదు. డిజిటల్ విద్య విద్యార్థిని ఎంత తొందరగా బాగుపరచగలిగినా కూడా, ఏమరుపాటుగా ఉంటే అధఃపాతాళానికి దిగజారుస్తుంది అనేది వాస్తవం.

ఐదోతరం కంప్యూటర్లు కూడా దూసుకొస్తున్న ఈ యుగం లో విద్యలో డిజిటలీకరణను ఎవరూ ఆపలేరు అనే మాట కూడా వాస్తవం. కార్పొరేట్ శక్తులు డిజిటలీకరణను ప్రోత్సహించడం వల్ల ఇది ఆక్టోపస్ లాగా విస్తరిస్తున్నది. మనం కొద్దోగొప్పో దీని వింత పోకడలను నియంత్రించకుంటే, సంప్రదాయక విద్యలు, బోధనా పద్ధతులు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. డిజిటల్ విద్య పరిధులను గుర్తించిన విద్యావేత్తలు డిజిటలీకరణకు సంప్రదాయ విద్యా విధానాన్ని పూర్తిగా తుడిచిపెట్టే అవకాశాన్ని ఇవ్వకుండా నియంత్రించాలి. ఈ మాత్రం జాగ్రత్త తీసుకుంటే డిజిటల్, సంప్రదాయ విద్యలు రెండూ కూడా పరస్పర సంపూరకంగా ఉండి, చెట్టాపట్టాలేసుకుని ప్రయాణించి విద్యార్థి భవితకు భరోసా కల్పిస్తాయి. లేదంటే మాత్రం ఈ డిజిటలీకరణ అటు విద్యార్థులను, ఇటు గురువులను కూడా గుల్లంతయ్యేలా చేయగలదు. కాబట్టి డిజిటల్ విద్యకు మానవీయ కోణాన్ని కలుపుదాం. డిజటీలకరణ, సంప్రదాయ బోధనల ఆరోగ్యకరమైన మిశ్రమాన్ని భావి తరాలకు అందిద్దాము.


◆ జి.ఎల్.ఎన్.ప్రసాద్
9441450987


ఇందులో ప్రచురించిన వ్యాసాలు, కథనాలు ఆయా రచయితల అభిప్రాయాలే. వీటితో సంపాదకవర్గానికి గానీ, యాజమాన్యానికి గానీ ఎలాంటి సంబంధం లేదు. - సంపాదకులు

# జీవజాతుల పరిరక్షణే అభివృద్ధికి మార్గం



ఆర్థిక అభివృద్ధి మాత్రమే లక్ష్యంగా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో పర్యావరణం, అందులో నివసించే జీవజాతులు పెను ముప్పును ఎదుర్కొంటున్నాయి. జీవుల మనుగడ ప్రారంభమైన తరువాత ఇప్పటివరకు ఐదు మహావిపత్తులు సంభవించాయి. మానవుడు దురాశతో పర్యావరణాన్ని కుళ్ళబొడచడాన్ని ఆర్థికాభివృద్ధి పేరుతో ఇలాగే కొనసాగిస్తే ఆరో మహావిపత్తు జీవజాతులకు సంభవిస్తుందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆరో విపత్తు సంభవిస్తే మాత్రం భూమి మీద జీవవైవిధ్యంలో చాలా తుడిచిపెట్టుకు పోతుంది. ఇలాంటి విపత్తులను నియంత్రించాలంటే ఆర్థికాభివృద్ధి సూత్రాలు, నిర్వచనాలు మారాలి. సుస్థిరాభివృద్ధి దిశగా ఆర్థికాభివృద్ధి అడుగులు వేస్తే జీవవైవిధ్యం కొనసాగుతుంది. భూమి మీద అనేక జీవావరణాలను మానవుడు నాశనం చేస్తున్నాడు. పర్యావరణ పరిరక్షణలో మానవుడు ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నాడు. ఈ వింత వైఖరి పారిశ్రామిక విప్లవం తదనంతర కాలం నుంచి ప్రారంభమయ్యింది. వాణిజ్య సంస్కృతి మొదలయిన తరువాత మానవుడు పంచభూతాలను కొల్లకొడుతున్నాడు. దీనివలన జంతువుల ఆవాసాలు దెబ్బతిని జీవజాతులు మానవుడి దెబ్బకు కుదేలవుతున్నాయి. ముఖ్యంగా అనేక జీవజాతులకు నెలవైన భారతదేశంలో పర్యావరణ సమతుల్యత వేగంగా దెబ్బతింటోంది. ఎడారులు, హిమాలయాలు, మడ అడవులు, సతతహరితారణ్యాలు, చిత్తడి నేలలు లాంటి వైవిధ్యమైన జీవావరణాలున్నాయి. ఈ ఆవాస విస్తృతిలో వచ్చే ఏ చిన్నపాటి మార్పైనా రుతుపవనాల మీద ప్రభావం చూపిస్తుంది. ఈ ఆవాసాలన్నీ మానవ కార్యకలాపాల వల్ల క్షీణిస్తున్నాయి. గతేడాది సర్వేల ప్రకారం జీవజాతులు సాధారణ శాతం కంటే కూడా వేయిరెట్లు వేగంగా అంతరించిపోతున్నాయి. ఎన్నో పక్షిజాతులు, క్షీరదాలు విలుప్తమయిపోతున్నాయి. గతంలో వచ్చిన మహాప్రళయాలన్ని అంతరిక్షంలో దారితప్పిన ఆస్టరాయిడ్ లాంటి శిలలు భూమిని తాకడం వల్ల జరిగితే, ఇప్పుడు రాబోయే ఆరవ విపత్తు కేవలం మానవుడి బాధ్యతా రాహిత్యం వల్ల రాబోతున్నది. అడవుల నరికివేత, కర్బన పదార్థాల ఉద్గారం, కాలుష్యం, పెరుగుతున్న భౌగోళిక ఉష్ణోగ్రతలు ఇవన్నీ కూడా జీవజాతులు అంతరించిపోవడానికి కారణమవుతున్నాయి. చివరకు ఎంతో జీవన సామర్థ్యం కలిగిన కీటక జాతులు కూడా అంతరించిపోతున్నాయి.

హిమాలయాలు కరుగుతున్నాయి...సముద్రాలు ఇంకుతున్నాయి. ఎడారీకరణ వేగం పుంజుకుంటున్నది. అడవుల శాతం దారుణంగా పడిపోయింది. పిచ్చుకలు, తేనెతుట్టెలు కనిపించకుండా పోతున్నాయి. గత అరవై మిలియన్ సంవత్సరాలలో ఎప్పుడు లేనంతగా వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సముద్రపు గవ్వలు గుల్లబారి పోతున్నాయి. ఆర్కిటిక్ ప్రాంతపు మంచు కరిగిపోతున్నది. పగడపు దీవుల రంగులు వెలసిపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 40 శాతం పక్షులు, బల్లులు అంతరించిపోయాయి. ప్రతి ఏడాది 200 నుంచి 2000 జంతు జాతులు అంతరించిపోతున్నాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. 2050 నాటికి చిరుతలు, ధ్రువపు ఎలుగుబంట్లు, ఖడ్గమృగాలు, చాలా రకాల తాబేళ్లు కనపడకుండా పోతాయి. ఇవన్నీ కూడా మానవుడి చేతిలోనే హతం అవుతుండడం ఒక విషాదకరమైన అంశం. మానవుడి విశృంఖలత్వం ఇలాగే కొనసాగితే ప్రకృతి పగ తీర్చుకోవడం తథ్యం. ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తే దాని ఫలితం తీవ్రంగా ఉంటుదని అనేకసార్లు నిరూపితమైంది. కొన్ని సంవత్సరాల క్రితం కేదారనాథ్‌లో వచ్చిన వరదలు అక్కడ కట్టిన హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్స్ వల్ల ఉధృత రూపం దాల్చాయని పర్యావరణ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అలాగే విశాఖలో హుదూద్ తుఫాన్ వచ్చినప్పుడు విమానాశ్రయం తీవ్రంగా దెబ్బతినడానికి కారణం అక్కడ ఉన్న మడ అడవులను నరికి విమానాశ్రయం నిర్మించడమే అని నిపుణులు తేల్చారు. మడ అడవులు తుఫాను గాలుల వేగాన్ని తగ్గిస్తాయి. వాటిని నరికి విమానాశ్రయం నిర్మించడంతో ప్రకృతి విపత్తు తీవ్రత పెరిగింది. ఒకప్పుడు ప్రతి రాష్ట్రంలో పవిత్ర వనాల పేరుతో అడవులను సంరక్షించేవారు. కానీ ఇప్పుడు అడవుల నరికివేత



ఎక్కువగా జరుగుతున్నది. అరణ్యాలు జనారణ్యాలుగా మారుతున్నాయి. ఎర్రచందనం లాంటి వాటి కోసం అడవులను కొల్లగొడుతున్నారు. శేషాచలం కొండల్లో అడవులు ఈ ముష్కరుల దుందుడుకు చర్యల వల్ల తగలబడిపోయాయి. శేషాచలం కొండలు, నల్లమల అడవులు జీవవైవిధ్య నెలవులు. అటువంటి అడవులు నాశనం అయితే చాలా జీవజాతులు అంతరించిపోతాయి. మన రాష్ట్రంలో శేషాచలం కొండల్లో మాత్రమే కనిపించే బెట్లుడత, స్లెండర్ లోరిస్, బంగారుబల్లి లాంటివి అరుదైన జాతులుగా గుర్తించబడ్డాయి. వీటి రక్షణ కేవలం శేషాచలం అడవులను కాపాడడం ద్వారా మాత్రమే సాధ్యం. ఇక పశ్చిమ కనుమలు ఈ రోజుకీ జీవవైవిధ్యాన్ని అత్యధిక శాతం కలిగి ఉన్నాయి. ఈ కొండలను తొలిచి రైలు మార్గాలు వేయడం, ప్రాజెక్ట్స్ నిర్మించడం జీవవైవిధ్యానికి ముప్పును కలుగజేస్తాయి. పుష్పజాతులు కూడా చివరకు అంతరించిపోతున్నాయి. దీనివల్ల మకరందం దొరకక తేనెటీగలు, సీతాకోక చిలుకలు కనుమరుగవుతున్నాయి. ఆధునిక దేవాలయాలుగా నెహ్రూ పేర్కొన్న ఆనకట్టల వల్ల చేపల వలసలు తగ్గి వాటి జనాభా క్షీణదశకు చేరుతున్నది. మరపడవలలో విచక్షణా రహితంగా లాభాపేక్షతో టన్నుల కొద్దీ చేపలు పట్టడం వల్ల చేపల సంతానోత్పత్తి తగ్గిపోతున్నది. సాగర కాలుష్యం వల్ల కొన్ని వందల తిమింగలాలు వొడ్డుకు చేరి మృతి చెందుతున్నాయి. తాబేళ్లు కనుమరుగవుతున్నాయి. ముఖ్యంగా నక్షత్ర తాబేళ్లు ఎక్కువగా వేటాడబడుతున్నాయి. చర్మం కోసం పాములను, కొమ్ము కోసం ఖడ్గమృగాన్ని, గోళ్ళ కోసం పులులను, లేహ్యాల కోసం పిచ్చుకలను, దంతాల కోసం ఏనుగులను చంపుతున్నారు. మంచుయుగంలో ఉన్న అతి పెద్ద ఏనుగు అయిన మమ్మూత్ మానవుడు వేటాడడం వల్లే అంతరించి పోయిందని భావిస్తున్నారు. ప్రస్తుత నాగరికయుగంలో ఆహారం కోసం కవిలి కోడి లాంటి అరుదైన జాతులను వేటాడుతుండడం శోచనీయం. తిరుపతి లాంటి క్షేత్రాలలో భక్తులకు పర్యావరణం పట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలి. ప్రయాణికుల తాకిడి వల్ల శేషాచలం అడవులలో నీటి వనరులు తగ్గిపోతున్నాయి. దీనివలన చాలా జీవజాతులు నీరు లభించక మరణిస్తున్నాయి. ఇలాంటి ప్రదేశాలలో భక్తుల సంఖ్య మీద, నీటి వాడకం మీద రేషన్ విధించడం మంచిది. బెంగళూరు లాంటి నగరాలు తీవ్ర మంచినీటి ఎద్దడిని ఇప్పటికే ఎదుర్కొంటున్నాయి. దీనికి కారణం చెరువులు కబ్జా చేసి నిర్మాణాలు కట్టడమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బహుళ అంతస్తు నిర్మాణాలు భూగర్భ జలాల మీద ఒత్తిడి పెంచుతున్నాయి. చెరువుల పూడికతీతలో

**పూర్వీకులలో ఉండే జీవకారుణ్యం మనకు ఆదర్శం కావాలి. పవిత్ర వనాల సంఖ్య పెంచాలి. పర్యావరణ హిత కార్యక్రమాలను చేపట్టాలి. కాలుష్య వ్రణాలతో కుదేలవుతున్న పర్యావరణాన్ని కాపాడి జీవజాతులను రక్షించకుంటే మానవాళి భారీమూల్యం చెల్లించక తప్పదు. జీవవైవిధ్యాన్ని కాపాడే సుస్థిర అభివృద్ధినే ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.**

గ్రామీణజనం పాలుపంచుకునేలా చేయాలి. నీటి సదస్సులు నిర్వహించాలి. పుష్కరాల లాంటివి ఒకప్పుడు నదులను కాపాడుకునే ఉద్దేశ్యంతో ప్రారంభమయ్యాయి. ఇప్పుడు అవే పుష్కరాలు నదీజలాల కాలుష్యానికి కారణమవుతున్నాయి. వేసవిలో మనుష్యులకు నీరు దొరకడమే మృగ్యమైతే ఇక జంతువుల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అంచనా వేయవచ్చు. నీటి కోసం అడవి జంతువులు జనావాసాలలోకి ప్రవేశించడం వల్ల మానవుడికి వాటితో సంఘర్షణ మొదలైంది. ఈ సమస్యకు పరిష్కారం అడవులలో నీటి నిల్వలను పెంచడమే. సాగునీరు, తాగునీరు అందజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అయినా, నీటిని పొదుపుగా వాడాల్సిన బాధ్యత ప్రజలదే. చెరువులు ఎండిపోవడం వల్ల, జలచర జీవుల వైవిధ్యం వేగంగా తగ్గిపోతున్నది. యేరు ఉంటేనే వూరు ఉంటుంది అనే విషయం ప్రజలు, ప్రభుత్వాలు గుర్తిస్తే మంచిది. గుర్రపుడెక్క లాంటి కలుపు మొక్కల వల్ల జలావరణం, పార్థీనియం లాంటి వాటి వల్ల పర్యావరణం దెబ్బతింటున్నాయి. వీటిని తొలగించి జీవవైవిధ్యాన్ని కాపాడాలి.

చివరికి వాణిజ్య సంస్కృతి ఆర్కిటిక్ ప్రాంతాన్ని కూడా వదలడం లేదు. సహజ వాయువు కోసం, పెట్రోలియం నిల్వల కోసం ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రారంభమైన తవ్వకాల వల్ల, అక్కడ పెరుగుతున్న రవాణ వాహనాల రాకపోకల వల్ల మంచు కరుగుతున్నది. ఆర్కిటిక్ ప్రాంత మంచు ప్రపంచ మంచినీటి అవసరాలను పెద్ద ఎత్తున తీరుస్తున్నది. ఈ మంచు ఖండాలను నాశనం చేయడం వల్ల ధ్రువపు ఎలుగుబంటి, సీల్ లాంటి జాతుల, పెంగ్విన్ పక్షుల జనాభా తగ్గుముఖం పడుతున్నాయి. జీవజాలం అంతా జలం మీదే ఆధారపడి ఉంది. ధ్రువ ప్రాంత పరిరక్షణకు ప్రపంచ దేశాలు నడుం బిగించాలి. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు ఎక్కువగా కాలుష్యాన్ని కలగజేస్తున్నాయి కాబట్టి ఆ దేశాల పౌరులలో పర్యావరణ స్పృహ కలిగించాల్సిన భాద్యత ఆ దేశ అధినేతల మీద ఉంది. కొన్నిదేశాలలో జాతీయ పక్షులు అంతరించి పోయాయంటే జీవజాతుల విలుప్తత ఎంత తీవ్రంగా ఉందో అంచనా వేయవచ్చు. మారిషస్ జాతీయ పక్షి డూడూ అంతరించి పోవడం దీనికి నిదర్శనం. పెద్దపులికి మించిన క్రూరజంతువుగా మనిషి రూపాంతరం చెందుతున్నాడనడానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాలలో ఎలుగుబంటి పిల్లలతో వ్యాపారం చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో గత 125 సంవత్సరాలలో 65 కరువు సంవత్సరాలు వచ్చాయని ప్రభుత్వ వర్గాలు అంచనా వేశాయి. ఈ తీవ్ర దుర్భిక్ష పరిస్థితుల వల్ల జిల్లావ్యాప్తంగా క్షీరదాల వైవిధ్యానికి ముప్పు వాటిల్లుతున్నది. ఈ జిల్లాలో పరిశోధకుల అంచనా ప్రకారం 24 జాతుల క్షీరదాలు ముప్పు బారిన పడబోతున్నాయి. అనంతపురం జిల్లా ఎడారీకరణకు గురవుతుండడంతో జీవజాతుల విలుప్త వేగం ఎక్కువగా ఉంది. మారుతున్న వాతావరణం, విఫలమవుతున్న రుతుపవనాలు ఇవన్నీ కూడా దేశ వ్యాప్తంగా జీవజాతుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

వ్యవసాయంలో వస్తున్న మార్పులు కూడా జీవజాతుల విలుప్తతకు దారి తీస్తున్నది. వ్యవసాయంలో రసాయనాల వాడకం పెరగడంతో వానపాముల జనాభా క్షీణిస్తున్నది. ఇది ఇలాగే కొనసాగితే మృత్తిక నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది. క్రిమి సంహారక మందుల వల్ల పక్షి గుడ్ల పెంకులు పెళుసుగా తయారవుతున్నాయి. దీని వలన పొదిగే సమయంలో గర్భస్థ పిండాలు చనిపోతున్నాయి. హిమాలయాలలో 163 జాతులు విలుప్తం కాబోతున్నాయి. 900 పక్షిజాతులకు, 300 క్షీరద జాతులకు హిమాలయాలు ఆవాసాన్ని కల్పిస్తున్నాయి. హిమాలయ ప్రాంతంలో మాత్రమే కనిపించే మంచుపులి త్వరలో అంతరించబోతున్నది. కొండ గొర్రెల జనాభా కూడా తగ్గుముఖం పడుతున్నది.

చెట్లు అంతరిస్తూ ఉండడంతో గొంగళిపురుగు దశలకు ఆహారం దొరకడం దుర్లభంగా ఉంది. గనుల తవ్వకం పర్యావరణం మీద మరో గుదిబండగా మారి జీవజాతుల దుంప తెంచుతూ ఉంది. 58 మిలియన్ సంవత్సరాల క్రితం వాతావరణ మార్పుల వల్ల అంతరించిన టిటనో బోవా అనే సర్పంలాగా, ప్రస్తుతం అనేక సర్పాలు ఆవాస క్షీణత వల్ల అంతరించి పోబోతున్నాయి. సర్పాలు ఎంత భయంకర ప్రాణులయినప్పటికీ, ఎలుకల జనాభాను నియంత్రిచడంలో ముఖ్య పాత్రను పోషిస్తాయి. అటువంటి సర్ప జాతుల విలుప్తత ఆహారపు గొలుసుల సమతుల్యతను దెబ్బతీస్తోంది. సేంద్రియ, సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఉన్నది. పూర్వీకులలో ఉండే జీవకారుణ్యం మనకు ఆదర్శం కావాలి. పవిత్ర వనాల సంఖ్య పెంచాలి. పర్యావరణ హిత కార్యక్ర మాలను చేపట్టాలి. కాలుష్య వ్రణాలతో కుదేలవుతున్న పర్యావరణాన్ని కాపాడి జీవజాతులను రక్షించకుంటే మానవాళి భారీ మూల్యం చెల్లించక తప్పదు. జీవవైవిధ్యాన్ని కాపాడే సుస్థిర అభివృద్ధినే ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.

◆ జీఎల్ఎన్ ప్రసాద్
9441450987

# జంతుహింసతో మానవాళికీ ముప్పే!



పూర్వ యుగాల నుంచి మానవుడు జంతువులతో సహవాసం, సహజీవనం చేస్తూ ఉన్నాడు. ముఖ్యంగా భారతీయ జీవన విధానంలో జంతువులకు మానవుడితో పాటు సమాన ప్రతిపత్తి కల్పించబడింది. జంతు వులను సైతం దైవ సమానంగా భావించే సంస్కృతి మనది. మన సంస్కృతిలో గజముఖులు, హయవ దనులు అయిన దేవతలు కనపడతారు. నాగుపాము ను సుబ్రహ్మణ్య స్వామిగా గ్రామీణులు ఆరాధిస్తుం టారు. గరుడపక్షి లాంటి పక్షులను దేవతా వాహనా లుగా కొలుస్తుంటాం. అసలు జంతువులను మచ్చిక చేసుకుని, వాటితో పనులు చేయించుకోవడం అనేది శ్రీరాముడితో ప్రారంభమయ్యిందని చెప్పవచ్చు. శ్రీ రాముడు కోతులతో, ఎలుగు బంట్లతో, ఉడుతలతో పనులు చేయించుకున్నాడని మన పురాణాల్లో ఉన్నది. అటువంటి మన దేశంలో జంతుహింస పెచ్చు మీరుతున్నది. ఆహారం కోసమో, ఆనందం కోసమో జంతువులను తీవ్రంగా హింసిస్తున్నారు. కోడి పందేల పేరుతోనో, జల్లికట్టు పేరుతోనో జంతువులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారు. పరిశోధనల కోసం చాలా జంతువుల మీద రసాయన ప్రయోగాలు చేస్తున్నారు. ఔషధ పరీక్షలను కోతి, ఎలుక లాంటి మూగజీవాల మీద నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయాలలో ప్రయోగశాలలకు అనుబంధంగా ఉన్న జంతువుల కాలనీలలో కుందేలు, ఎలుకులను పెంచి వాటి మీద ప్రయోగాలు చేస్తున్నారు. గుర్రాలు, ఏనుగులను మత సంబంధ ఊరేగింపులలో ఎక్కువగా ఉపయోగిస్తుండడం వల్ల వాటి సంతాన సాఫల్యత సైతం తగ్గుతున్నది. పాడి, చూడి పశువులను రైతులు బాగా చూసుకున్నప్పటికీ గొడ్డుపోయిన వాటిని పెద్ద సంఖ్యలో కబేళాలకు తరలిస్తున్నారు. వీటి రవాణాలో వాటిని దారుణంగా మర్మాంగాలు నలిగిపోయేలా దారుణంగా కట్టివేసి తరలిస్తున్నారు. ఊర పిచ్చుకలను లేహ్యాల కోసం చంపుతున్నారు. మొసళ్ళ, పాముల చర్మాలను బతికి ఉండగానే ఒలుస్తున్నారు. ఆకలి తీర్చుకోవడం కోసం జంతువులను చంపడం కొద్దిగా అంగీకార యోగ్యంగా కనిపిస్తున్నప్పటికీ వాటిని ఆహారం కోసం చంపే విధానంలో ఇప్పుడు అనుసరిస్తున్న విధానాలలో మానవీయ కోణం పూర్తిగా మృగ్యం అవుతున్నది. ప్రతి రోజూ కొన్నివేల ముంగిసల తోకలు కత్తిరించబడుతున్నాయి. ఉడుతల చర్మంతో కుచ్చుటోపీలు చేసుకుంటున్నారు. ఫాషన్ డిజైన్ రంగంలో జంతు చర్మంతో చేసిన వస్త్రాలకు, బెల్టులకు గిరాకీ పెరుగుతున్నది. మంచి ఉద్దేశంతో ప్రారంభించిన పండుగలు కూడా జంతు హింసకు దారితీస్తున్నాయి. నాగుల చవితి రోజు పాము పుట్టలలో పాలు పోయడం వల్ల పాములు వాటి ఆవాసాలు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పాములకు పాలు జీర్ణం కాదు అనే ఇంగితం జనాలలో లోపించడం వల్ల ఇలాంటి ఇబ్బందులు పాములకు కలుగుతున్నాయి. పుట్టలో ఉన్నంత వరకు పాముకు పాలుపోసే ప్రయత్నం చేసే ఈ జనాలే, పుట్ట బయటకు పాము వస్తే తరిమి.....తరిమి చంపుతారు. పాము విషాన్ని ఆయుర్వేద మందులలో వాడతారు. ఈ విషం తీసే ప్రక్రియలో కూడా అవి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి.

ఇక మాంసాహారం ఉత్పత్తిలో జంతువుల స్వేద రంధ్రాలు మైనంతో పూడ్చి, వాటిలో అడ్రినలిన్ స్రావం ఎక్కువయ్యేలా చేసి చంపుతున్నారు. దీనికి కారణం అడ్రినలిన్ వలన మాంసానికి రుచి వస్తుంది. శాకాహారులు జంతువులను హింసించడంలో ఈ మాత్రం తక్కువ తినలేదు. పాల ఉత్పత్తిలో ఆవులకు ఈస్ట్రోజెన్, ఆక్సిటోసిన్ లాంటి హార్మోన్లను ఇచ్చి క్షీరోత్పత్తిని, స్రావాన్ని పెంచుతారు. తరువాత దూడను, ఆవును వేరుచేసి పాలు పిండుతారు. దీనివల్ల ఆవు, దూడ రెండూ తీవ్ర మానసిక సంఘర్షణకు గురి అవుతాయి.

ఇక అల్బినో ఎలుకలకు ప్రయోగశాలలలో అనేక రసాయనాలు ఇచ్చి వాటిలో వచ్చే మార్పులను పరిశోధకులు అంచనా వేస్తారు. వాటికి క్రిమిసంహారక మందులు, ఔషధాలు కూడా ఇచ్చి వాటి ప్రభావాన్ని అంచనా వేస్తారు. అంటే మానవుల ఉపయోగానికి ఔషధాలను మార్కెట్‌లోకి తరలించడానికి ముందు, అనేక జంతువులు మన కోసం వధ్యశిలను ఎక్కుతున్నాయి. మానవుడు సాధు జంతువులనే కాదు.... చివరకు క్రూర జంతువులను కూడా వదలట్లేదు. కొన్ని దశాబ్దాల క్రితం హైదరాబాద్‌లోని జంతు ప్రదర్శన శాలలో సాహీ అనే పులిని చంపి తోలు వొలిచి తీసుకుపోవడం అప్పట్లో పెద్ద సంచలనం కలిగించింది. విశ్వాసానికి మారు పేరైన కుక్కలను విచ్చలవిడిగా మాంసం కోసం చంపుతున్నారు. నాగాలాండ్ లాంటి ప్రదేశాలలో కుక్క మాంసాన్ని విక్రయించే సంతలు ఉన్నాయి. ఎస్కిమోలు కూడా కుక్క మాంసాన్ని తింటారు. జీబ్రా చేపల జన్యువటం మానవ జన్యువటంతో పోలికలను ఎక్కువగా కలిగి ఉండడం వల్ల వాటి మీద విస్తృత ప్రయోగాలను చేస్తున్నారు. ఈ పరిశోధనల సమయంలో జంతువుల హక్కులను ఎవరూ గౌరవించడం లేదు. సీల్, వాల్రస్ అనే క్షీరదాలను దంతాల కోసం, కొవ్వు కోసం వేటాడుతున్నారు. చివరకు జంతు ఆవాసాలను రక్షించాలన్న సంస్కారం కూడా మనలో మృగ్యం అవుతున్నది. వేట చాలామంది గొప్ప వారికి వ్యసనంగా మారింది. కొంతమంది సెలబ్రిటీలు కృష్ణ జింకను వేటాడి చిక్కుల్లో పడిను ఉదంతాలున్నాయి. కస్తూరి జింకను సువాసన ద్రవ్యం కోసం, చమరీ మృగాన్ని చామరం కోసం చంపుతున్నారు. ఈ ఆధునిక యుగంలో కూడా జింక చర్మం వ్యాపారం జోరుగా సాగుతున్నది. సైన్సు పరిశోధనల కోసం జంతువులను చంపుతుంటే, మతం మూఢత్వంతో జంతువులను చంపుతున్నది.

**జంతువులు పర్యావరణ సమతుల్యతకు, ఆహార గొలుసుల సమతా స్థితికి తోడ్పడతాయి. కాబట్టి ప్రతి జంతువు హక్కును, ఉనికిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. అటవీ చట్టాలకు మరింత పదును కల్పించడం, అడవిదొంగలను అదను చూసి కటకటాల వెనుక తోయడం, స్థానికులను జంతు సంరక్షణలో భాగస్వాములను చేయడం, యువతలో జంతు కారుణ్య భావనను పెంపొందిచడం లాంటి వాటి ద్వారా జంతు హింసను కొద్దిగా అరికట్టవచ్చు.**



ఇక గజరాజులైతే మానవ హింస వల్ల గజగజా వణుకుతున్నాయి. మన దేశంలో ప్రస్తుతం 2700 ఏనుగులు మాత్రమే ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇవి అత్యధిక గర్భావధి కాలాన్ని కలిగి ఉండడం వల్ల వీటి జనాభా కూడా వేగంగా పెరిగే అవకాశం లేదు. అప్పుడే పుట్టిన పిల్ల ఏనుగే 260 పౌండ్లు ఉంటుంది. వీటి ఆవాసాలు, వలస మార్గాలు కుచించుకుపోవడం వల్ల వీటికి మేత దొరకడం కూడా కష్టం అయిపోయింది. ఏనుగులను మానవులు హింసించడం ఆదిమకాలం నుంచి జరుగుతూనే ఉంది. మమ్మూత్ అనే భారీ ఏనుగులను మంచుయుగంలోనే మానవులు ఆహారం కోసం విచక్షణ రహితంగా వేటాడడం వల్ల అంతరించిపోయింది. నిన్నటి మొన్నటి వరకు సర్కస్‌లో ఈ ఏనుగులను ప్రదర్శనల కోసం హింసించేవారు. కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల లోని సత్య మంగళం అడవులలోనే వీరప్పన్ ఒక్కడే కొన్ని వందల ఏనుగులను దంతాల కోసం దారుణంగా మట్టుబెట్టాడు. ఏనుగులు గుంపులుగా జీవిస్తాయి. ఈ గుంపుకు ఆడ ఏనుగు ఆధిపత్యం వహిస్తుంది. అంటే ఏనుగులది మాతృస్వామ్య వ్యవస్థ. మగ ఏనుగులు ఒక ఋతు సమయంలో తప్ప సాధారణంగా ఒంటరిగా జీవిస్తాయి. మదగజాలు టేస్టోస్టిరాన్ ప్రకోపం వల్ల అప్పుడప్పుడు హింసాత్మక ప్రవృత్తిని కనబరుస్తాయి. కలప రవాణా కోసం ఏనుగులను హింస పెడుతున్నారు. వీటి దంతాలు, చర్మం మొదలైన వాటిని అక్రమ రవాణా చేస్తున్నారు. ఏనుగులాంటి ఇంకో భారీ జంతువు ఖడ్గమృగం కూడా అడవి దొంగల చేతిలో హతమవుతున్నది. వీటిని కూడా కొమ్ము కోసం, చర్మం కోసం హతమారుస్తున్నారు. నల్ల బజారులో ఖడ్గమృగం కొమ్ము ధర అరవై వేల డాలర్లు పలుకుతున్నది. క్రొత్తగా వియత్నాంలో ఖడ్గమృగాల వ్యాపారం ఊపందుకొంది. చైనా దేశంలో అయితే ఈ ఖడ్గమృగ వ్యాపారం జోరుగా సాగుతున్నది. ఈ దేశంలో పులిగోర్లకు, చివరికి పులి విసర్జితాలకు కూడా అపరిమితమైన గిరాకీ ఉంది.

జంతువులు పర్యావరణ సమతుల్యతకు, ఆహార గొలుసుల సమతా స్థితికి తోడ్పడతాయి. కాబట్టి ప్రతి జంతువు హక్కును, ఉనికిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంది. ఆటవీ చట్టాలకు మరింత పదును కల్పించడం, అడవిదొంగలను అదను చూసి కటకటాల వెనుక తోయడం, స్థానికులను జంతు సంరక్షణలో భాగస్వాములను చేయడం, యువతలో జంతు కారుణ్య భావనను పెంపొందిచడం లాంటి వాటి ద్వారా ఈ జంతు హింసను కొద్దిగా అరికట్టవచ్చు. జంతువుల మీద ఈ పెచ్చుమీరుతున్న హింసకు చరమ గీతం పాడకుంటే మానవాళి మొత్తం తీవ్ర మూల్యాన్ని చెల్లించాల్సివస్తుంది.

◆ జి.ఎల్.ఎన్.ప్రసాద్
9441450987

Fri, 30 August 2019


# అటవీ సంరక్షణ అందరి బాధ్యత



అడవులు దేశ సౌభాగ్యానికి చిహ్నాలు. ప్రకృతి అందాలకు నెలవులు ...... ఆనందానికి కేంద్ర బిందువులు. పురాణాల కాలంలో ఋష్యాశ్రమాలు అరణ్యాలలో ఉండేవి. అప్పట్లో ప్రతి మనిషి జీవిత చరమాంకం అయిన వానప్రస్థ ఆశ్రమంలో వనాలకు వెళ్లి తనువు చాలించేవాడు. అర ణ్యం మనకు చాలా విషయాలను, జీవిత సత్యాలను బోధిస్తుంది. ఆటవిక నీతిని, ధర్మాన్ని తక్కువగా అంచ నా వేయకూడదు. ఎన్నో జీవన ధర్మాలను, వైవిధ్యాల ను కలిగి ఉన్న జంతువులు అరణ్యాలలో కనిపిస్తాయి. చెట్టు, చేమ, రాయి, రప్పలను కూడా పూజించే సం స్కృతి మనది. ప్రకృతితో మమేకం కావడం భారతీయ జీవన సూత్రం. మారుతున్న జీవన శైలి వల్ల అడవుల మీద ప్రపంచ వ్యాప్తంగా ఒత్తిడి పెరుగుతోంది. అడవులు నరికివేతకు గురవుతున్నాయి. ఈ అడవుల నరికివేత వల్ల గూడు చెదిరి, గుండె పగిలి వనచరా లన్నీ కూడా మానవ ఆవాసాల మీదకు దండెత్తుతు న్నాయి. దీనివల్ల మానవులకు, జంతువులకు మధ్య అనారోగ్యకరమైన పోటీ ఏర్పడుతోంది. పర్యవసానంగా ఎన్నో అడవులను కోల్పోతున్నాం. అడవుల నరికివేత ఇలానే కొనసాగితే, కొన్ని సంవత్సరాల లోపే మన దేశం 'జీ రో ఫారెస్ట్' దుస్థితిని ఎదుర్కొనాల్సిన దుస్థితి దాపు రిస్తుంది. ఆటవీ సంపదను దోచుకోవడం అనేది మన దేశంలో బ్రిటిష్ వారి రాకతో మొదలైంది. వీరు ఎక్కువగా కలపను కట్టడాలలో ఉపయోగించేవారు. అంతకు ముందు స్వదేశీ రాజులు రాళ్ళతో కట్టడాలను నిర్మించేవారు. అలాగే వ్యాపారుల దృష్టిలో అడవి అంటే కలప మాత్రమే. కలప కోసం అడవుల నరికివేత బ్రిటిష్ భారతంలోనే పతాక స్థాయికి చేరింది. అసలు అడవుల వల్ల ఒనగూడే మేలు తలచుకుంటే, అడవులను నరికి వేయడం వల్ల ఎంత నష్టం వాటిల్లుతుందో అంచనా వేయవచ్చు. అడవులు దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలు. పర్యావరణ సమతుల్యతను కాపాడే విషయంలో అడవులు కీలక పాత్ర పోషిస్తాయి. జీవ వైవిధ్యానికి అడవులు నెలవులు. మృత్తికా క్షయాన్ని, కాలుష్యాన్ని అడవులు నియంత్రిస్తాయి. అడవులు వర్షాలను ఆకర్షిస్తాయి. అందుకే అడవులు ఉన్న ప్రాంతంలో ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. అడవుల మీద ఆధారపడి చాలా పరిశ్రమలు పనిచేస్తున్నాయి. అమెజాన్ అడవులు ప్రపంచ మానవాళి ఆక్సిజన్ అవసరాలను 20 శాతం వరకు తీరుస్తున్నాయి. అడవులు పర్యావరణానికి ఊపిరి తిత్తులని చెప్పవచ్చు. కాగితం, జిగురు, సాంబ్రాణి, తేనె, అగ్గిపుల్లలు, రైలు స్లీపర్ పెట్టెలు, చివరకు ఆట పరికరాలు కూడా అడవుల నుంచి తయారయ్యే ఉత్పత్తులే.

ప్రతి గిరిజన ప్రాంతంలోను ఒక పురాతన వృక్షం వుంటుంది. దానిని దేవతా వృక్షంగా గిరిజనులు పూజిస్తారు. ఎన్నోరకాల మందులను మూలికలను గిరిజనులు అడవిలో పెరిగే చెట్ల నుంచి తయారు చేస్తారు. అసలు పరిజ్ఞానం ఉండాలే గానీ, మూలిక కాని మొక్కే లేదు. గిరిజన వైద్యం అంతా అడవుల మీదే ఆధారపడి ఉంది. మేఘాలయ లాంటి చోట పవిత్ర వనాలను పెంచుతారు. ఇలాంటి చోట మానవ సంబంధ కార్యకలాపాలకు అనుమతి ఉండదు. అసలు గిరిజనుల ఆహారం అంతా పండ్లు, ఫలాలు, గింజలు, జంతువుల రూపంలో అడవుల నుంచే వస్తుంది.

2013 లో గూగుల్ ఎర్త్ నిర్వహించిన సర్వే ప్రకారం ప్రపంచ దేశాలు అప్పటికే 2.3 మిలియన్ చదరపు కిలోమీటర్ల అడవులను కోల్పోయాయి. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల లోనే 50శాతం అడవులు నరికివేతకు గురవుతున్నాయి. క్రీస్తు పూర్వం 3000 నాటికి భారత దేశంలో 80శాతం అడవులుండేవి. ఏ దేశమైనా సుభిక్షంగా ఉండడానికి 33శాతం అడవులు అవసరం. అలాంటిది ఇప్పుడు మన దేశంలో అడవుల విస్తీర్ణం 12శాతానికి పడిపోవడం శోచనీయం. భారత దేశం, మయాన్మార్, శ్రీలంకలోనే 41.4శాతం అడవులు నరికివేతకు గురవుతున్నాయి. ఇప్పుడు మన అటవీ సంపద ప్రపంచ అటవీ సంపదలో కేవలం ఒకశాతం మాత్రమే. ఏటా మనం 1.5 మిలియన్ హెక్టార్ల అడవిని కోల్పోతున్నాం. అడవులను ఎక్కువగా వంట చెరుకు కోసం నరికి వేస్తున్నారు. ఏటా దేశంలో 170 మిలియన్ టన్నుల వంట చెరుకు వాడుతున్నారు. అడవుల నరికివేత వల్ల ఏటా దేశ వ్యాప్తంగా ఒకశాతం భూ ఉపరితలం చవుడుబారిపోతున్నది. ఎడారీకరణ ఊపందుకొంటూ ఉంది. రాయలసీమ అనంతపురంలో అసలు పొదలు తప్ప అడవులు కనిపించవు. చిత్తూరు జిల్లాలో శేషాచలం అడవులు ఎన్నో అరుదైన వృక్ష, జంతు జాతులను కలిగిఉన్నాయి. అడవుల నరికివేతను నిలిపివేయాలంటే ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలి. అడవులను కొల్లగొడుతున్న వ్యాపారులను కఠినంగా శిక్షించేలా చట్టాలుండాలి. ముఖ్యంగా అడవుల సంరక్షణలో స్థానిక తెగల సహాయ సహకారాలను అధికారులు తీసుకోవాలి. ఇలా అందరిని కలుపుకుంటూ, బహుముఖ వ్యూహాల ద్వారా అడవులను రక్షించుకునే బాధ్యతను అంకిత భావంతో నిర్వహిస్తే ధరిత్రి పులకరిస్తుంది.



◆ జి.ఎల్.ఎన్. ప్రసాద్
9441450987

# వాతావరణ మార్పులు తెస్తున్న పెనుముప్పు



ఇటీవలి కాలంలో వాతావరణంలో వస్తున్న పెను మార్పులు మానవాళిని వణికిస్తున్నాయి. కరుగుతున్న హిమ ఖండాలు, పెరుగుతున్న సముద్ర మట్టాలు, పొంగుతున్న నదులు, ముంచుతున్న వరదలు, కుంగుతున్న సముద్ర తీర ప్రాంతాలు మొదలైన వినాశకర వైపరీత్యాలన్నీ కూడా వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్నవేనని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ప్రకృతి ఉత్పాతాలన్నీ ప్రపంచ పట రూపు రేఖల్ని మార్చబోతున్నాయి. రుతువులు తిరగబడడం వల్ల వ్యవసాయ దిగుబడి తగ్గి ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మారింది. హరిత విప్లవం వల్ల సాధించిన స్వయం సమృద్ధి హరిత గృహ ప్రభావం వల్ల తగ్గుముఖం పడుతున్నది. వాతావరణ మార్పుల వలన మలేరియా లాంటి వ్యాధుల వ్యాప్తి పెరిగి సామజిక ఆరోగ్యం దెబ్బ తింటున్నది. అభివృద్ధి పేర అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు వాతావరణ మార్పులకు కారణమై పర్యావరణం మీద ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తున్నాయి. పెట్టుబడిదారీ విధానాలు పర్యావరణానికి గొడ్డలి పెట్టుగా మారుతున్నాయి. పెరుగుతున్న పరిశ్రమలు పర్యావరణం మీద రాచ పుండ్లుగా మారుతున్నాయి. పారిశ్రామికీకరణ అనంతరం పర్యావరణం పూర్తిగా కాలుష్య కారకాలతో మురిగిపోతున్నది.

ఈ వాతావరణ మార్పులకు కారణం విజ్ఞానాన్ని పెంచుకుంటూ విచక్షణను మరిచిపోతున్న మానవుడే. వాతావరణం మీద మానవ కార్యకలాపాలు తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తున్న ఈ ప్రస్తుత కాలాన్ని శాస్త్రవేత్తలు 'అంత్రోపోసిన్' యుగంగా వర్ణిస్తున్నారు. శాస్త్రీయతను మాత్రమే గౌరవిస్తూ సంప్రదాయాలను తుంగలో తొక్కేస్తున్న ఆధునిక శాస్త్రవేత్తలు, పండుగుల పేరుతో నదులను కలుషితం చేస్తున్న ఛాందసులు ఈ పర్యావరణ క్షీణతకు సమాన బాధ్యత వహించాల్సి ఉంటుంది. వాతావరణ మార్పుల వలన ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడుతున్న ఉత్పాతాలు తీవ్ర పరితాపాన్ని కలిగిస్తున్నాయి. ఇండోనేషియా రాజధాని జకార్త సముద్రంలోకి 2050 సంవత్సరం నాటికి మూడవ వంతు క్రుంగిపోయే ప్రమాదం పొంచి వుందని ఆ దేశాధ్యక్షుడు ఇప్పటికే ప్రకటించారు. ఇండోనేషియా ఇప్పుడు తన రాజధానిని మార్చుకునే ప్రయత్నంలో తలమునకలై ఉంది. హిమాలయాల మీద మంచు కూడా 2050 సంవత్సరం నాటికి యాభై శాతం వరకు కరిగిపోయే అవకాశం ఉంది. కైలాస మానస సరోవర యాత్రలు చేసే యాత్రికుల సంఖ్య పెరుగుతుండడం వలన హిమాలయ సానువులలో మానవ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఎవరెస్ట్ శిఖర ప్రాంతంలో పర్వతారోహక బృందాలు ప్లాస్టిక్ వ్యర్థాలను పరిసర ప్రాంతాలలో వదిలివేస్తున్నాయి. ఇలాంటి మానవ సంబంధిత వ్యర్థాలు వాతావరణ మార్పులకు కారణం అవుతున్నాయి. హరిత గృహ ప్రభావం వలన కొన్ని ప్రాంతాలలో ఏడాది పొడవునా వేసవి తాపం కొనసాగుతూ ఉంటే, మరి కొన్ని ప్రాంతాలలో ఏడాది పొడవున ముంచెత్తుతున్న వరదలు ఆస్తి, ప్రాణ నష్టాన్ని కలుగ జేస్తున్నాయి. ప్రకృతిని కొల్లగొట్టి పొట్ట నింపుకునే ప్రయత్నం మానవుడు చేస్తున్నాడు. నల్లమల ప్రాంతంలో యురేనియం నిక్షేపాల మీద ఇప్పుడు పారిశ్రామికవేత్తల కన్ను పడింది. అరకు లోయ, శేషాచలం కొండలు టూరిస్టుల తాకిడికి విలవిల లాడుతున్నాయి. ఇంత కాలం అరుదైన ప్రకృతి సంపదకు ఆలవాలమైన సుదూర ప్రాంతాల మీద కూడా పెట్టుబడిదారుల కన్ను పడింది. అమెరికన్ అధ్యక్షుడు ట్రంప్ ఇటీవలనే సహజ వాయువుల నిక్షేపాలకు ఆలవాలమైన గ్రీన్ లాండ్‌ను సొంతం చేసుకోవాలనే ఆకాంక్షను వెల్లడించారు. చివరకు ఆర్కిటిక్ ప్రాంత సహజ వనరుల మీద కూడా భారత దేశంతో సహా అన్ని దేశాల కన్ను పడింది. ఈ అరుదైన భౌగోళిక ప్రాంతాల నైసర్గిక స్వరూపం మారితే, దీని ప్రభావం వాతావరణ నాణ్యత మీద ఖచ్చితంగా పడుతుంది.



**వాతావరణ పెను మార్పులు తెస్తున్న సమస్యలను అధిగమించాలంటే మానవాళి కాస్తా బాధ్యతా యుతంగా ఉండడం అలవరుచుకోవాలి. కార్బన్ ఉద్గారాలను తగ్గించాలి. శిలాజ ఇంధనాల స్థానంలో ప్రత్యామ్నాయ ఇంధనాల వాడకాన్ని పెంచాలి. సౌర ఘటాల వినియోగాన్ని పెంచాలి. వ్యవసాయంలో వరి పండించడాన్ని తగ్గించాలి. పర్యావరణ హానికర రసాయనాలను వినియోగించడం మానివేయాలి. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి. ఎవరెస్ట్ శిఖరం వద్ద ప్లాస్టిక్ వాడకాన్ని ఇప్పటికే నేపాల్ ప్రభుత్వం నిషేధించడం జరిగింది.**

భౌగోళిక ఉష్ణోగ్రత మూడు నుంచి నాలుగు డిగ్రీలు అదనంగా పెరిగితే ప్రపంచ వ్యాప్తంగా 330 మిలియన్ల జనాభా నిర్వాసితులవుతారు. దీని వలన పొరుగు దేశాలకు వలస వెళ్ళే శరణార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఇది రాజకీయ అనిశ్చితికి దారి తీస్తుంది. మహా రాష్ట్ర, గోవా, గుజరాత్ లాంటి సముద్ర తీర ప్రాంతాలు సముద్ర మట్టం పెరగడంతో ఇప్పటికే ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. తీర ప్రాంతాలు అసాధారణంగా కోతకు గురి అవుతున్నాయి. గోవాలో చాలా బీచ్‌లు నీట మునిగే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒడిషా లాంటి రాష్ట్రాలలో తుఫానుల రూపంలో ప్రకృతి విలయం ఏర్పడుతుంది. వాతావరణ మార్పులు కలుగజేస్తున్న ముప్పు ఒక్కొక్కసారి నిపుణుల అంచనాలకు సైతం అందడం లేదు.

2010సంవత్సరం నాటికే భారత దేశం రెండువేల నూట ముప్పై ఆరు మిలియన్ టన్నుల హరిత గృహ వాయువులను విడుదల చేసింది. ఇంధన వనరుల వినియోగం వలన 71 శాతం హరిత గృహ వాయువులు వెలువడుతున్నాయి. ఈ హరిత గృహ వాయువులలో 8 శాతం పరిశ్రమల నుంచి విడుదల అవుతుంటే 18 శాతం వ్యవసాయ సంబంధిత కార్యకలాపాల వలన విడుదల అవుతుండడం విపరీత పరిణామం. ఈ వాయువుల వలన భారత దేశ ఉపరితల ఉష్ణోగ్రతలో 0.4 శాతం పెరుగుదల నమోదయ్యింది. దీని వలన మన దేశంలో సముద్ర మట్టాలు సగటున సంవత్సరానికి 1.75 మిల్లీ మీటర్ల వరకు పెరుగుతున్నాయి. వాతావరణ మార్పుల వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఒకప్పుడు 14 శాతం ఉన్న వర్షాధార అడవుల విస్తీర్ణం ఇప్పుడు కేవలం 6 శాతానికి పడిపోయింది. ఈ మార్పులు ఇలానే కొనసాగితే రానున్న నలభై సంవత్సరాలలో భూమి మీద వర్షాదార అరణ్యాలు అదృశ్యమవుతాయని పర్యావరణవేత్తలు గగ్గోలు పెడుతున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా మానవాళి శారీరిక, మానసిక ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. అడవుల రూపు రేఖలు మారడం వలన వన్య ప్రాణుల జనాభాలో అస్థిరత చోటు చేసుకుంటున్నది. వేసవి నిప్పులు చెరుగుతుంటే, చలి కాలంలో పొగ మంచు కొరుక్కు తింటున్నది. వేసవిలో వడ దెబ్బ వలన చనిపోతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. వాతావరణ పెను మార్పుల వలన పక్షుల వలస మార్గాలు కూడా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. వలస వచ్చిన ప్రాంతాలలో గింజలు దొరకక పక్షులు ఎక్కువ సంఖ్యలో చనిపోతున్నాయి. పక్షులకు నీరు దొరకడం కూడా కష్టమయిపోయింది. రుతువులలో వస్తున్న అకాల మార్పుల వలన పక్షులకు వలసకు కావలసిన ప్రేరణ కూడా రావడం లేదు. చిత్తడి నెలలు అంతరించి పోవడం వలన పక్షులు తమ ఆవాసాలను కోల్పోతున్నాయి. పరాయి దేశాలకు వలస వచ్చిన ఈ పక్షులు అక్కడ ఆహారం, ఆశ్రయం దొరకక ప్రవాసంలోనే మరణిస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన మానవుడితో సహా అన్ని జంతువులలో హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటున్నది. పెరుగుతున్న సాగర జల ఉష్ణోగ్రతల వలన ప్రవాళాలు దెబ్బతింటున్నాయి. ఆర్కిటిక్ మంచు కరిగి సముద్ర మట్టం పెరగడం వలన సముద్ర తాబేళ్ల ఆవాసాలు కొట్టుకు పోతున్నాయి. పెరుగుతున్న సముద్ర జల, తీర ప్రాంత ఇసుక ఉష్ణోగ్రతల వలన పసిఫిక్ సముద్రంలో ఉన్న ఆకుపచ్చ తాబేళ్లలో స్త్రీ తాబేళ్ల సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండడం పర్యావరణవేత్తలు గమనించారు. ఆస్ట్రేలియా లోని బ్రాంబిల్ క్రే మేలోమిస్ అనే జీవిని వాతావరణ పెను మార్పుల వలన అంతరించిపోయిన మొదటి క్షీరదంగా గుర్తించారు. భౌగోళిక తాపం ఇలానే కొనసాగితే మరి కొన్ని క్షీరదాలు ఇలాగే అంతరించిపోవచ్చు.

వాతావరణంలో పేరుకుపోతున్న రేణు పదార్థాలు కూడా ప్రతికూల మార్పులకు కారణమవుతున్నాయి. ఇవి మేఘాలు ఏర్పడకుండా అడ్డుకుంటున్నాయి. దీనివలన వివిధ ప్రాంతాలలో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి. వాతావరణ మార్పు వలన నీటి కరువు కూడా ఏర్పడుతున్నది. వాతావరణ మార్పుల వలన ఆల్బేడో కూడా మారుతున్నది. భూమిని చేరకుండా వెనుకకు పరావర్తనం చెందుతున్న సౌర శక్తిని ఆల్బేడో అంటారు. మంచు ఆల్బేడో 90 శాతం ఉంటే సముద్ర జలం ఆల్బేడో 20 శాతం కంటే తక్కువగా ఉంటుంది. దీనిలో మార్పులు వస్తే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది.

వాతావరణ పెను మార్పులు తెస్తున్న సమస్యలను అధిగమించాలంటే మానవాళి కాస్తా బాధ్యతా యుతంగా ఉండడం అలవరుచుకోవాలి. కార్బన్ ఉద్గారాలను తగ్గించాలి. శిలాజ ఇంధనాల స్థానంలో ప్రత్యామ్నాయ ఇంధనాల వాడకాన్ని పెంచాలి. సౌర ఘటాల వినియోగాన్ని పెంచాలి. వ్యవసాయంలో వరి పండించడాన్ని తగ్గించాలి. పర్యావరణ హానికర రసాయనాలను వినియోగించడం మానివేయాలి. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి. ఎవరెస్ట్ శిఖరం వద్ద ప్లాస్టిక్ వాడకాన్ని ఇప్పటికే నేపాల్ ప్రభుత్వం నిషేధించడం జరిగింది. హిమాలయ, మానస సరోవర ప్రాంతాలను సంరక్షించుకునే దిశగా ప్రభుత్వాలు చొరవ చూపాలి. పక్షుల వలస ప్రాంతాలను కాపాడాలి. చిత్తడి నేలలను, మంచు ఖండాలను కాపాడు కోవడానికి శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించుకోవాలి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి, మారుతున్న వాతావరణ పరిస్థితుల నుంచి సముద్రాలను, నదులను, అడవులను కాపాడుకోవలసిన బాధ్యత ఇక మనదే. ఈ దిశగా ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాయని ఆశిద్దాము.

◆ జి.ఎల్.ఎన్. ప్రసాద్
9441450987

# మత్తులో యువత భవిత



ఒకప్పుడు ఏ దక్షిణ అమెరికా లాంటి ప్రాంతాలకో మాత్రమే పరిమితమైన మాదక ద్రవ్యాల వాడకం ఇప్పుడు మన దేశానికి కూడా వ్యాప్తి చెందింది. మన దేశ యువత చాలా మంది మత్తులో జోగడానికి ఇష్ట పడుతూ, పబ్బుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ ఉన్నారు. ముఖ్యంగా విద్యార్థులను కేంద్రంగా చేసుకుని మాదక ద్రవ్య మాఫియా విస్తరిస్తూ ఉంది. నగరాలలో అయితే పదో తరగతి విద్యార్థుల స్థాయి నుంచే ఈ డ్రగ్స్ వాడకం మొదలవుతూ ఉంది. జీవితాన్ని అన్ని కోణా లలో అనుభవించేయాలనే ఒక వెర్రి వ్యామోహం కుర్రకారును డ్రగ్స్ వైపు ఆకర్షించబడేలా చేస్తోంది. యువత జీవితాన్ని అనుష్ఠాన యోగంగా మలుచుకోవాల్సిన దశలో తెలిసో తెలియకో హద్దు మీరిన అనుభవాల కోసం ఆరాటపడుతూ మాదక ద్రవ్యాలను స్వీకరిస్తున్నారు. దీని వలన వాస్తవ జగత్తుకు... మిధ్యా జగత్తుకు మధ్య తేడాను మరిచి పోతున్నారు. చిత్త భ్రమలకు, విభ్రమలకు లోనై మానసిక రోగులుగా రూపాంతరం చెందుతున్నారు. ఒకప్పుడు సినిమా రంగంలో ఉన్న వారికి మాత్రమే అందుబాటులో ఉండే ఈ మత్తు పదార్థాలు ఇప్పుడు విద్యార్థి లోకానికి కూడా అందుబాటులోకి వచ్చాయి. ప్రలోభాలకు లొంగి యవ్వన దశలో వీటికి బానిస అవుతే మాత్రం బయట పడడం దుర్లభమై జీవితం నరక ప్రాయంగా మారుతుంది. అన్ని రంగాలలో పెరుగుతున్న వొత్తిడి, అంతర్జాల మార్కెట్‌లో అందుబాటు లోకి వస్తున్న మాదక ద్రవ్యాలు, మారుతున్న కుటుంబ నేపథ్యం, జీవన శైలి లాంటివి అన్నీ కూడా యువతలో మాదక ద్రవ్యాల వాడకం పెరగడానికి కారణాలవుతున్నాయి. యువతలో పరిస్థితులను ఎదుర్కొనే ధోరణి మాయమై, పలాయనవాదం చోటు చేసుకో వడం కూడా ఈ మత్తు పదార్థాల వాడకానికి దారి తీస్తోంది. విస్తరిస్తున్న వ్యాపార సంస్కృతి వలన భోగ లాలసత ఎక్కువై కూడా ఇటువంటి మిధ్యా వ్యామోహాల వైపు యువత ఆకర్షించబడుతున్నారు. అసలు మత్తులో అంత మహత్యం ఏముంది అనే విషయాన్ని పరిశీలిద్దాము.

సాధారణంగా ఏ కొత్త అలవాటైనా యవ్వనంలో ఏర్పడుతుంది. ఈ మత్తు పదార్థాల అలవాటు కూడా యవ్వన దశలోనే ఎక్కువగా మొదలవుతుంది. ఏదో ఒక రూపంలో రసాయనాలను తీసుకుని రసమయ జగత్తులో తేలియాడాలనే తపన ఆ లేత ప్రాయంలో కలగడం సహజం. ఇప్పుడు అమ్మాయిలు కూడా ఈ మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతుండడం శోచనీయం. మొదట పొగ తాగడం తో ఈ యువత రసాయన జగత్తులోకి ప్రవేశిస్తుంది. తక్కువ ధరతో, అన్ని చోట్ల దొరికేది సిగరెట్. దీనిని సరదాగా కాల్చడం ప్రారంభించి, చివరకు జీవితాన్ని కాల్చేసుకుంటున్నారు నేటి యువత. పొగతాగుతున్న వారిలో మహిళలు కూడా చేరిపోతున్నారు. సిగరెట్ తాగితే మెదడులో నూతన ఆలోచనల ఒరవడి పెరుగుతుంది అనుకోవడం కేవలం ఒక అపోహ మాత్రమే. చాలా చిన్న వయస్సులోనే ఈ పొగ తాగే అలవాటు నేర్చుకోవడం వలన యువతలో కాలేయ, హృదయ సంబంధ సమస్యలు ఎక్కువవుతున్నాయి. చాల మంది యువకులు పొగ తాగడం వలన వీర్య కణాల సంఖ్య తగ్గి నిర్వీర్యులుగా మారిపోతున్నారు. పొగాకు వాడకం వలన జన్యు సంబంధ రుగ్మతలు కూడా ఎక్కువవుతున్నాయి. కొంత మంది పొగ తాగకుండా, గుట్కా రూపంలో నికోటిన్‌ను నములుతున్నారు. ప్రాచీన భారతంలో నశ్యం రూపంలో ఈ పొగాకు తీసుకునే వారు. 'నశ్యం...సర్వ జన వశ్యం' అంటూ అప్పట్లో వీధి భాగవతార్లు ఈ ముక్కు పొడుం పుచ్చుకునే వారు. మన దేశంలో వాడుతున్న పొగాకు వర్జీనియా రకానికి చెందినది. ఒకప్పుడు గంట చుట్టల రూపంలో అందుబాటులోకి వచ్చిన ఈ పొగచుట్టలు ఇప్పుడు సిగరెట్‌గా రూపాంతరం చెంది కుర్రకారు మనసు దోచుకొంటున్నాయి. ఏ రూపంలో పొగాకును తీసుకున్నా కూడా ఆరోగ్య సమస్యలు అతి చిన్న వయస్సులోనే తలెత్తడం ఖాయం.

తరువాత దశలో యువత ఆల్కహాల్ వైపు ఆకర్షితులవుతున్నారు. మందు.... చిందు....విందు... పొందు ఈ రోజు యువతకు రోజు వారీ వ్యవహారా లుగా

> **ఒక సర్వే వలన ఢిల్లీలో తొంభై శాతం మంది వీధి బాలలు ఏదో ఒక మత్తు పదార్థాన్ని తీసుకోవడానికి అలవాటు పడ్డారని తెలిసింది. ఈ వీధి బాలలలో సామా జిక చైతన్యాన్ని కలిగించి, వారికి సామాజిక భద్రతను కల్పించగలిగితే ఈ సమస్య నుంచి వారు బయట పడగలరు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో మద్యపానం వలన కలిగే అనర్థాల గురించి చైతన్య సదస్సులు నిర్వహించాలి. అంచెలంచెలుగా మద్యపాన నిషేధం అమలుపరిచే దిశగా ప్రభుత్వాలు చట్టాలు తీసుకు రావాలి. ఈ మాదక ద్రవ్యాల వాడకాన్ని కట్టడి చేయకుంటే మాత్రం భవిష్యత్తులో భారతీయ యువత మత్తులో కూరుకునిపోయి గల్లంతయ్యే ప్రమాదం ఉంది.**

మారిపోయాయి. హగ్గులు... పెగ్గులు నాగరికతా చిహ్నాలుగా మారి కూచున్నాయి. ఇప్పుడు విందులు వినోదాలలో మద్యపానం జోరందుకుంది. యువతలో నేర ప్రవృత్తి పెరగడానికి ప్రధాన కారణం మద్యపానం. తాగిన మత్తులో విచక్షణ కోల్పోయి యువత నేరాలకు, ఘోరాలకు పాల్పడుతున్నారు. నగరాలలో బార్ల సంఖ్య పెరిగి, కుర్ర కారు బీరు బుడ్లకు తెగ అలవాటు పడుతున్నారు. కొన్ని కుటుంబాలలో తాగడం ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది.

ఐక మాదక ద్రవ్య వినియోగం ఇటీవల యువతలో విపరీతంగా పెరుగుతోంది. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు మాదకద్రవ్య వ్యాపారాలకు కేంద్రాలుగా మారిపోతున్నాయి. ఒకప్పుడు కొన్ని మత సంబంధ పండుగలలో భంగు లాంటి మత్తు పదార్థాలను వాడేవారు. గసగసాలు మొక్క నుంచి తీసే నల్ల మందు ఒక రకమైన మాదక ద్రవ్యం. ఒపియాయిడ్స్ రకానికి చెందిన మాదక ద్రవ్యాలలో మార్ఫిన్, హెరాయిన్ లాంటి మాదక ద్రవ్యాలు చేరతాయి. మార్ఫిన్‌కు నొప్పిని నివారణ చేయగల సుగుణం ఉన్నప్పటికీ శస్త్ర చికిత్సలలో కూడా దీని వాడకం మీద నిషేధం ఉంది. ఎందుకంటే సాధారణంగా వీటిని వాడిన యువత వీటికి అలవాటు పడిపోతారు. ఇవి వాడకుండా ఉండలేని మానసిక స్థితి ఏర్పడుతుంది. మొదటిలో కేంద్ర నాడీ వ్యవస్థ ఉత్తేజానికి గురియినప్పటికీ, తరువాతి దశలలో ఈ మాదక ద్రవ్యాలు వాడేవారు కుంగుబాటుకు గురి అవుతారు. మత్తు దిగిన తరువాత వాస్తవ జగత్తులోని సమస్యలు వారిని భయపెడతాయి. వాటిని ఎదుర్కొనే ధైర్యం లేక, జీవిత వాస్తవాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్యా ప్రయత్నాలు చేస్తారు.

ఐక్య రాజ్య సమితి అంచనాల ప్రకారం భారత దేశంలో ఒక మిలియన్ మందియువతీ యువకులు హెరాయిన్‌కు బానిసలయ్యారు. ఢిల్లీ లాంటి నగరాలలో ఎనిమిది ఏళ్ళ చిరు ప్రాయంలో ఉన్న బాలుడు మత్తు పదార్థాలకు బానిస కావడం సామాజిక శాస్త్రవేత్తలను కలవరపరిచింది. పంజాబ్‌లో ఈ డ్రగ్ మాఫి




యా విపరీతంగా ఉందని ఇటీవలి సర్వేలు తెలియజేస్తున్నాయి. మాదక ద్రవ్యాలను వాడుతున్నవారిలో అరవై ఒక్క శాతం మంది ఒపియాయిడ్స్ వాడుతున్నారు. సుమారు ఏడు రకాలకు చెందిన మాదక ద్రవ్యాలు మన దేశంలో చెలామణిలో ఉన్నాయి. అభివృద్ధి చెందిన అమెరికాలోని లాస్ ఏంజిల్స్ లాంటి నగరాలలో ఒకప్పుడు ఈ మాదక ద్రవ్య వ్యాపారులు సమాంతర ప్రభుత్వాలను నడిపారు. 188 మిలియన్ల మంది గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు ప్రపంచ వ్యాప్తంగా ఏదో ఒక రూపంలో బానిసలయ్యారని అధికారిక లెక్కలు చెప్తున్నాయి.

ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు రోజుకు ఒకసారి కానీ లేక అనేక సార్లు గానీ వీటిని తీసుకోవాల్సిన పరిస్థితి తలఎత్తుతుంది. అధిక మోతాదులో వీటిని తీసుకోవడం వలన మరణాల రేటు పెరిగింది. ఉన్మాద లేదా ఉన్మత్త స్థితిలో ఉన్న వీరిని గుర్తించడం తేలిక. అందుకే ఇంటిలో తల్లి తండ్రులు తమ పిల్లలను ఒక కంట కనిపెడుతూ ఉండాలి. తమ పిల్లలు నేర ప్రవృత్తి కలిగిన వారితో సహవాసం చేయకుండా ముందే నియంత్రించాలి. తరచు పిల్లలు ఏదో కారణం చెప్పి ఇంటి నుంచి బయటకు పోతున్నా, ప్రవర్తనాపర లోపాలు కొట్టొచ్చినట్టు కనపడినా వెంటనే ఆరా తీయడం మంచిది. పిల్లలు చేసే ఖర్చులను కూడా కనిపెడుతూ ఉండాలి. పిల్లలలో నైతిక విలువల మీద గౌరవం పెంచేలా కుటుంబ వాతావరణం ఉండాలి. కళ్ళు ఎర్ర బడడం, రక్త పీడనం పెరగడం, తీవ్ర భావోద్వేగ ప్రదర్శన పిల్లలలో కనిపిస్తే మొదటే జాగ్రత్త పడడం మంచిది. ఈ లక్షణాలు కనపడినప్పుడు స్నేహ పూర్వకంగా పిల్లలతో మాట్లాడి సమస్య జటిలం కాకుండా చూసుకోవాలి. సమస్య తీవ్రంగా ఉంటే మానసిక వైద్యుడి ద్వారా చికిత్స చేయించాలి. ఈ డ్రగ్స్ తీసుకున్న వారిలో కొంత మందిలో విపరీత లైంగిక వాంఛ కలగవచ్చు. అటువంటి వారు లైంగిక నేరాలకు పాల్పడగలరు. మాదక ద్రవ్యాలను సూది మందు రూపంలో తీసుకునేవారిలో ఎయిడ్స్ వ్యాధి వచ్చే ప్రమాదం కూడా ఉంది.

మాదక ద్రవ్య వాడకం వలన వచ్చే అనర్థాల గురించి విద్యార్థులలో చైతన్యం వచ్చేలా అవగాహనా సదస్సులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలి. కుటుంబంలో సంబంధ బాంధవ్యాలు ధృడంగా ఉండేలా చూసుకోవాలి. పిల్లలకు తల్లి తండ్రులు తమ వ్యక్తిగత సమయాన్ని కేటాయించాలి. సామాజిక మాధ్యమాలను పిల్లలు ఏ విధంగా వాడుతున్నారో గమనిస్తూ ఉండాలి. కొన్ని మత సంబంధ కార్యకలాపాలలో వయోబేధం లేకుండా భంగు, హషీష్ లాంటి మాదక ద్రవ్యాలు చట్ట వ్యతిరేకంగా పంచుతూ ఉండడం ఇప్పటికీ ప్రపంచంలో అనేక దేశాలలో ఉంది. ఆటువంటి కార్యక్రమాలకు పిల్లలను దూరం ఉంచాలి. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారే వారిలో ఎనభై శాతం మంది మానసిక కారణాల వలన వీటిని తీసుకోవడం మొదలెట్టారని పరిశోధకులు తెలుపుతున్నారు. పది శాతం మంది సామాజిక కారణాల వలన వీటికి బానిసలుగా మారుతున్నారు. మాదక ద్రవ్య అలవాటు ఉన్న స్నేహితులు, దగ్గరి బంధువుల నుంచి పిల్లలను దూరం పెట్టడం శ్రేయస్కరం. మాదక ద్రవ్య సంబంధ నేరాలలో పడే శిక్ష గురించి యువతలో సదస్సుల ద్వారా అవగాహన కల్పించాలి. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాలలో ఈ సమస్య జటిలంగా ఉండడం వలన అక్కడి యువతలో మాదక ద్రవ్య వాడకం వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలి. అనాథ బాలలు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారు. ఒక సర్వే వలన ఢిల్లీలో తొంభై శాతం మంది వీధి బాలలు ఏదో ఒక మత్తు పదార్థాన్ని తీసుకోవడానికి అలవాటు పడ్డారని తెలిసింది. ఈ వీధి బాలలలో సామాజిక చైతన్యాన్ని కలిగించి, వారికి సామాజిక భద్రతను కల్పించగలిగితే ఈ సమస్య నుంచి వారు బయట పడగలరు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో మద్యపానం వలన కలిగే అనర్థాల గురించి చైతన్య సదస్సులు నిర్వహించాలి. అంచెలంచెలుగా మద్యపాన నిషేధం అమలుపరిచే దిశగా ప్రభుత్వాలు చట్టాలు తీసుకు రావాలి. ఈ మాదక ద్రవ్యాల వాడకాన్ని కట్టడి చేయకుంటే మాత్రం భవిష్యత్తులో భారతీయ యువత మత్తులో కూరుకునిపోయి గల్లంతయ్యే ప్రమాదం ఉంది.

◆ జి.ఎల్.ఎన్. ప్రసాద్
9441450987



# జన చైతన్యం - జల చైతన్యం





**కొన్ని అరుదైన అంతరించిపోతున్న జలవనరులను అంతర్జాతీయ స్థాయిలో అన్ని ప్రభుత్వాలు కాపాడాలి. జల శక్తి అభియాన్ పేరుతో కేంద్రప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాలు భవిష్యత్తులో నీటి ఇబ్బందులు రాకుండా నివారించగల స్ఫూర్తితో కొనసాగుతున్నాయి. వరుణుడు కరుణించినప్పుడే వరద నీటిని ఒడిసి పట్టుకుని జలనిధిని పెంపొందించుకోవాలి. గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు జల చైతన్యాన్ని జనంలో కలిగించకపోతే భావి తరాలకు జలం దొరకడం దుర్లభం అవుతుంది.**

◆ జి.ఎల్.ఎన్.ప్రసాద్
9441450987

# పెరుగుతున్న ఆత్మహత్యా ధోరణులు



చదివి... చదివి... చదివి... చావంగనేటికి.... చావు లేని చదువు చదువవలయు అని కొన్ని శతాబ్దాల క్రితమే అన్నాడు వేమన. కానీ నేటి విద్యా విధానంలో మనం వెలగబెడుతున్న చదువులు విద్యార్థుల చావుకు వస్తున్నాయి. పోటీ ప్రపంచంలో వ్యక్తి విలువను డిగ్రీలు నిర్ణయిస్తుండడం, విద్యా వ్యవస్థలో ఒక అవాంఛనీయమైన పోటీ నెలకొనడంతో విద్యార్థులకు అన్ని వైపుల నుంచి వొత్తిడి ఎదురవుతున్నది. ఈ వొత్తిడిని జయించే మార్గం లేక యువత ఆత్మహత్య బాట పడుతున్నారు. అసలు ఆత్మహత్యా ధోరణి ప్రబలడానికి చాలా కారణాలు ఉంటాయి. దీనికి వ్యక్తిగత, వ్యవస్థాగత, సామాజిక కారణాలు తోడయినపుడు వ్యక్తి ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయం తీసుకుంటాడు. ఈ తీవ్రత కొన్ని క్షణాల పాటు ఉంటుంది. కొంత మంది మాత్రమే ఆత్మహత్యకు ముందుగా చాలా కాలం ప్రణాళిక వేసుకుంటారు. మిగిలిన చాలా మందిలో ఏదో ఒక ప్రతి కూల భావోద్వేగం తీవ్రంగా కుదిపేయడం వలన ఈ ఆత్మహత్యా ధోరణి ప్రబలుతుంది. కొంతమందిలో మానసిక రుగ్మతలు, అపసవ్యతలు ఉండడం వలన కూడా ఈ ధోరణి కనిపిస్తుంది. అలా అని ఆత్మహత్య చేసుకునే వారందరూ మానసిక రోగులు లేదా బలహీన మనస్కులు కారు. పురాణాలలో ఎక్కడా ఆత్మహత్య ప్రస్తావన కనిపించదు. కొంతమంది వీరులు వాగ్దాన భంగం చేసినపుడు ప్రాయశ్చిత్తంగా ప్రాయో పవేశం చేసిన ఘటనలు ఇతిహాసాలలో వర్ణించ బడ్డాయి. అదే విధంగా చారిత్రక యుగాలలో భర్తతో పాటు సతీ సహగమనం చేసిన స్త్రీలు కనిపిస్తారు. దీనిని ఆత్మ త్యాగంగా వర్ణించినా కూడా, ఇవి ముమ్మాటికి ఆత్మహత్యలే. శత్రువుల చేతిలో భర్తలు మరణించినపుడు, ముష్కర మూకల చేతిలో పడకుండా ఉండడానికి ఒకప్పుడు రాచపుత్రికలు బలవన్మరణాన్ని ఆశ్రయించేవారు. ఈ విధంగా చారిత్రక కాలంలో ఆత్మహత్యలకు బలమైన సామాజిక, రాజకీయ కారణాలు ఉండేవి. ఎంత బలమైన కారణానికి అయినా కూడా తనువు చాలించడం పరిష్కారం కాదనే విజ్ఞత లేని వాళ్ళు మాత్రమే ఆత్మహత్యను సమస్యకు పరిష్కారంగా భావిస్తారు. అసలు ఏ జంతువులలో కూడా కనీసం ఛాయా మాత్రంగా లేని ఈ ఆత్మహత్య అనే వింత పోకడ మానవ మస్తిష్కం లోనికి ఎలా ప్రవేశించింది అనే అంశం మానసిక శాస్త్రవేత్తలకు కూడా అంతు చిక్కడం లేదు. జంతువులలో డాల్ఫిన్స్‌లో ఈ ఆత్మహత్య పోకడ కనిపిస్తుంది అని కొంత మంది భావిస్తున్నప్పటికీ దీనిని ఇంకా నిర్ధారించలేదు. ఈ ఆత్మహత్య చేసుకోవాలనే పెడధోరణి పరిణామ క్రమంలో మానవులకు మాత్రమే కలగడం శోచనీయం. మన దేశంలో, క్యాన్సర్ కంటే ఎక్కువగా ఆత్మహత్యల మరణాలు సంభవిస్తున్నాయి.

### కారణాలు

మానసికంగా ప్రస్తుత తరం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటూ ఉందని చెప్పవచ్చు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంతరించి పోవడం ఆత్మహత్యల శాతం పెరగడానికి ఒక కారణంగా సామాజిక శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఒకప్పుడు కుటుంబాలలో ఉండే వృద్ధులు యువతకు సంక్షోభ సమయంలో మానసిక స్థైర్యాన్ని కల్పించేవారు. ఈ వృద్ధతరం వారి అనుభవాలను యువతరంతో పంచుకోవడం వలన అనేక సమస్యలకు పరిష్కారాలు సహజంగానే అందుబాటులో ఉండేవి. కానీ ఇటీవలి కాలంలో తరాల మధ్య పెరుగుతున్న దూరం అనేక మానసిక వైక్లబ్యాలకు దారి తీస్తోంది. అప్పట్లో కనిపించే తాత.... తండ్రి... మనమడు అనే అనుబంధాల నిచ్చెన మెట్లు నేడు కనపడవు. దీనివలన ప్రతి తరంలో ఏదో ఒక తెలియని వెలితి, భావ శూన్యత ఏర్పడుతున్నది.

పోటీ ప్రపంచంలో అనారోగ్యకరమైన ధోరణులు ప్రబలుతున్నాయి. ప్రతి ఒకరు వేరొకళ్ళతో తమను తాము పోల్చుకుంటూ, అసంతృప్తికో అహంభావానికో లోనవుతున్నారు. మోతాదు మించిన నైరాశ్యం బలవన్మరణానికి దారితీస్తుంది. చదువులో వెనుకబాటుతనం చాలా మందిని కృంగదీస్తున్నది. అంతర్జాతీయ విద్యాసంస్థలైన ఐఐటీలలో కూడా విద్యార్థులు వరుస ఆత్మహత్యలకు పాల్పడుతుండడం మానసిక శాస్త్రవేత్తలను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. పది మందికి బతుకునిచ్చే వైద్య కోర్సులను అభ్యసిస్తున్నవారు కూడా అర్ధాంతరంగా జీవితాలను చాలిస్తున్నారు. వృత్తి విద్యా సంస్థలలో ఊహించనంత ఒత్తిడిని విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. సెమిస్టర్ విధానంలో విద్యార్థులకు ఎప్పుడూ పరీక్షల ఒత్తిడి ఉండడం సహజం. కొంత మంది ఈ ఒత్తిడి కి అలవాటు పడితే... మరికొంత మంది తీవ్ర నైరాశ్యానికి గురి అవుతున్నారు. పరుగు ఎక్కడ ఆపాలో తెలియక కొందరు... పరుగు ఎప్పుడు ఆగుతుందో తెలియక కొందరు మానసిక ఒత్తిడికి గురిఅవుతు న్నారు. చదువుల కోసం దూర ప్రాంతాలకు వలస వెళ్ళిన విద్యార్థులు ఇంటి మీది బెంగతో క్రుంగుబాటుకు గురై ఆత్మహత్య చేసుకుంటున్నారు. కొంత మంది విద్యార్థులు ర్యాగింగ్ వలన ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరి కొంతమంది సున్నిత మనస్కులు అధ్యాపకులు తిట్టారని, సెమిస్టర్‌లో మార్కులు తక్కువ వచ్చాయని, స్నేహితులు దూరం అయ్యారనే లాంటి చిన్న చిన్న కారణాలకు బలవన్మరణం చెందుతున్నారు. కొన్ని కుటుంబాలలో పెద్దలు పిల్లలను ఇతరులతో పోల్చడం వలన కూడా ఆత్మహత్యా ధోరణి ప్రబలడానికి ఒక కారణం.

కుటుంబ వాతావరణంలో కూడా మృగ్యమవుతున్న మానవ సంబంధాలు యువతరాన్ని ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నాయి. ఇప్పుడు ప్రతివ్యక్తి ఒక ద్వీపం లాగా మారిపోయి, తన చుట్టూ గిరిగీసుకు బతికేస్తున్నాడు. దీనివలన ఇతరులతో సంబంధ బాంధవ్యాలు దెబ్బతిని అవసరమయినపుడు మానసిక స్వాంతన లభించక యువత ఆత్మహత్యల వైపు అడుగులేస్తున్నారు. ఎక్కువ సమయం చరవాణులు, కంప్యూటర్స్‌తో గడిపేవారు ఆత్మహత్య స్వభావాన్ని కలిగి ఉంటారు. అంతర్జాలం యువత సుప్తచేతన మీద చూపించే ప్రతికూల ధోరణి యువతను ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తున్నది. పబ్జి లాంటి వీడియో గేమ్స్ ఆడుతూ కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతుండడం ఇందుకు నిదర్శనం.

చిన్నప్పటి నుంచి ఆత్మ నూన్యతా భావం కలిగి ఉండేవారు ఎక్కువగా ఆత్మహత్య ధోరణిని ప్రదర్శిస్తారు. పది మందితో తమ సమస్యలను చెప్పుకునే వారు బతకడానికి ఇష్టపడతారు కానీ చావడానికి ఇష్టపడరు. కొండంత కష్టమొచ్చినా కూడా ఇలాంటి వారు వేరే వారితో ఆ కష్టాన్ని పంచుకుని... మనసు బరువు దింపేసుకుని ధైర్యంగా ఉంటారు. అలా కాక ఎప్పుడూ ఏకాంతంలో గడిపేవారు... తీవ్ర ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకుంటారు. ఆత్మహత్య స్వభావం పేదా ధనిక వర్గాలన్నిటిలో సమానంగా కనపడుతుంది. ఆత్మహత్యలకు కారణాలు మారవచ్చునేమో గానీ, ఈ ధోరణి ఎవరిలో నైనా ప్రబలవచ్చుననేది వాస్తవం.

ఆర్థిక ఇబ్బందులు అనేక సార్లు ఆత్మహత్యకు పురికొల్పవచ్చు. చనిపోతే బాకీ తీర్చాల్సిన పనిలేదు అనే ఒక వింత పోకడ వలన కొంతమంది స్వీయ మరణానికి పాల్పడుతారు. ఇటీవలి కాలంలో తల్లి తండ్రులు తిట్టారని, చరవాణి లాగేసుకున్నారనే చిన్నాచితకా కారణాలకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తను చనిపోతే విలువ తెలిసి వస్తుందనే వింత మనస్తత్వం కొంతమందిని ఆత్మహత్యకు పురికొల్పుతుంది. ఈ ఆత్మహత్యా ధోరణి ఒక మానసిక జాడ్యంగా మారి భారతీయ యువతను విలవిలలాడిస్తున్నది. తల్లిదండ్రులకు తీవ్ర శోకాన్ని మిగిలిస్తూ ఉంది.

జీవిత పరమ పద సోపాన పటం లో నిచ్చెనలు ఎన్ని ఉంటాయో... పాములు కూడా అన్నే ఉంటాయనే ఇంగిత జ్ఞానం లోపించడం వలన కొద్ది మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఏ రంగంలోనైనా ఆటుపోట్లు సహజమే. కళా రంగంలో ఆకాశం నుంచి అధః పాతాళానికి పడిపోవడానికి నిమిషం పట్టదు. ఈ జారుడు మెట్ల వ్యవహారాన్ని జీర్ణించుకోలేక, చాలా మంది జీవితాన్ని చేజేతులా జారవిడుచుకుంటున్నారు. కళాకారులలో భావ స్పందన అధికంగా ఉంటుంది. ఆ రంగంలో వారు తీసుకునే నిర్ణయాలు కూడా అంతే తీవ్రతను కలిగి ఉంటాయి.




**సమస్యను ఎదగడానికి అవకాశంగా భావిస్తే, ఏ సమస్య కూడా ఒత్తిడిని కలగజేయదు. అన్నిటికంటే మించి కుటుంబ వ్యవస్థను గౌరవిస్తూ అనుబంధాల నీడలలో తలదాచుకుంటే, వంద వసంతాల పాటు బతకాలనే జీవితేచ్ఛ ఈ నాటి యువతలో కూడా కలగడం ఖాయం. అప్పుడు మాత్రమే అఖండ యువ భారతావని అచంచల విశ్వాసంతో వంద వసంతాలు జీవించడం సాధ్యమవుతుంది.**

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విద్యార్థులను ఒత్తిడికి గురిచేసేలా కళాశాల వాతావరణం ఉండకూడదు. తల్లి ఒడిలో పిల్ల వాడికి ఎంత భద్రత ఉంటుందో, కళాశాలలో విద్యార్థికి అంత భద్రత ఉండాలి. ఈ మధ్య వృత్తి విద్యా కళాశాలలలో విద్యార్థులు నూతన పరిసరాలకు, వ్యక్తులకు అలవాటు పడేలా చేయడానికి ప్రత్యేకంగా జీవన నైపుణ్యాల మీద అవగాహనా సదస్సులను నిర్వహిస్తున్నారు. ర్యాగింగ్ చట్టాల గురించి కూడా విద్యార్థులకు అవగాహన కలుగజేస్తున్నారు. అదే విధంగా విద్యార్థుల మానసిక స్థైర్యాన్ని పెంచడానికి కావాల్సిన భోధనా పద్ధతులను మెరుగు పరుచుకోవడానికి అధ్యాపకులకు కూడా కార్యశాలలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులు కూడా సమయాన్ని వృథా చేయకుండా ఎంచుకున్న కోర్స్ మీద దృష్టి నిలిపి ప్రణాళికాబద్ధంగా చదివితే ఒత్తిడి దరిచేరదు. యువత మానవ సంబంధాలను, కుటుంబ వ్యవస్థను గౌరవించే సంస్కారాన్ని అలవరచుకోవాలి. బాధను పది మందితో పంచుకోవడం అలవాటు చేసుకోవాలి. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించగల స్థితప్రజ్ఞతను యువత అలవరచుకోవాలి. ఒకరితో పోల్చుకుని క్రుంగిపోయే అలవాటు నుంచి బయటపడాలి. చదువే కాకుండా క్రీడలకు ప్రాధాన్య మివ్వాలి. ఆహ్లాదకరమైన యాత్రలను చేపట్టాలి. ఏదైనా తప్పు చేస్తే, పశ్చాత్తాప పడి, అపరాధ భావన నుంచి వెంటనే బయటపడాలి. సమస్యను ఎదగడానికి అవకాశంగా భావిస్తే, ఏ సమస్య కూడా ఒత్తిడిని కలగజేయదు. అన్నిటికంటే మించి కుటుంబ వ్యవస్థను గౌరవిస్తూ అనుబంధాల నీడలలో తల దాచుకుంటే, వంద వసంతాల పాటు బతకాలనే జీవితేచ్ఛ ఈ నాటి యువతలో కూడా కలగడం ఖాయం. అప్పుడు మాత్రమే అఖండ యువ భారతావని అచంచల విశ్వాసంతో వంద వసంతాలు జీవించడం సాధ్యమవుతుంది.

◆ జి.ఎల్.ఎన్. ప్రసాద్
9441450987

# ఆన్‌లైన్ నైపుణ్యాలు పెంచుకోవాల్సిందే!

ఒకప్పుడు సంప్రదాయక తరగతి గదుల్లో నాలుగు గోడల మధ్య రాబోయే తరాలకు భవిష్యత్ నిర్దేశనం చేసిన గురువులు ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో తమ బోధనా విధానాన్ని మార్చుకుంటున్నారు. ఇప్పుడు గురువులందరూ గూగుల్ తెరపై వారి బోధనా నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారు. ఒకప్పుడు ఐఐటీల లాంటి అత్యుత్తమ విద్యాసంస్థలకు మాత్రమే పరిమితమైన ఆన్‌లైన్ బోధన నేడు గ్రామీణ ప్రాంత విద్యాలయాల్లో కూడా కనిపిస్తోంది. కరోనా వ్యాధి వ్యాప్తిని అరికట్టే వ్యూహంలో భాగంగా విద్యార్థుల మధ్య భౌతిక దూరం పాటించే క్రమంలో ఈ ఆన్‌లైన్ బోధనను అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు విద్యా సంస్థలు చేపట్టాయి. ఉన్నత విద్యలో ప్రవేశాలు కూడా ఆన్‌లైన్ విధానంలోనే జరగడం ముదావహం. వీటన్నిటి వలన విద్యార్థులు విలువైన విద్యా సంవత్సరాన్ని కోల్పోకుండా కాపాడడం జరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంకా కొన్ని నెలలు ఆన్‌లైన్ బోధన కొనసాగడం అనివార్యంగా కనిపిస్తోంది. ఇప్పుడు అన్ని విద్యాసంస్థలకు ఆన్‌లైన్ బోధనలో నైపుణ్యాలు బాగానే పట్టుపడ్డాయని చెప్పవచ్చు. ముందుముందు కూడా బ్లెండెడ్ తరగతులను నిర్వహించడమే మంచిదని విద్యావేత్తలు భావిస్తున్నారు. చాలా ఉన్నత కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ఇప్పటికే సెమిస్టర్ సిలబస్‌ను ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేసేసారు. ప్రాక్టికల్ తరగతులు కూడా వర్చ్యువల్ విధానంలో చక్కగా నిర్వహించడం జరిగిపోయింది. మార్పు అనివార్యం అని గ్రహించిన మరుక్షణమే, ఇటు గురువులు అటు విద్యార్థులు కూడా చక్కగా ఈ ఆన్‌లైన్ బోధనా విధానాన్ని అనతికాలంలోనే ఆకళింపు చేసుకున్నారు. పాత తరానికి చెందిన గురువులు సైతం సుద్ద ముక్కను, నల్ల బోర్డును వదిలేసి తెర మీద తమ బోధనకు రంగులద్దడానికి కావాల్సిన హంగులు ఏర్పరుచుకోవడానికి సన్నద్ధమైపోయారు. మార్పును స్వాగతించడం... మార్పును అంగీకరించడం అనేవి గురుతర బాధ్యతలుగా గురువులు గుర్తించి దానికి తగ్గట్టుగా ఇప్పుడు తమ ఆన్‌లైన్ సామర్థ్యాలకు మెరుగులు దిద్దుకుంటున్నారు. ఒకప్పుడు పలకా బలపం పట్టుకు తిరిగిన గ్రామీణ విద్యార్థుల చేతుల్లో కూడా ఈ రోజు స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు కేవలం తమ టీచర్లు చెప్పిన పాఠాలను మాత్రమే విన్న విద్యార్థులు నేడు భూగోళం ఆవలి వైపున కూచున్న నిపుణుల పాఠాలను కడుపులో చల్ల కదలకుండా ఇంట్లో కూచుని వింటున్నారు. అదే విధంగా అధ్యాపకులు కూడా ఈ నిపుణులతో జాతీయ, అంతర్జాతీయ వెబినార్‌లు నిర్వహిస్తున్నారు.

ఒకప్పుడు ఈ అంతర్జాతీయ సదస్సులను నిర్వహించడం చాలా ఖర్చుతో కూడుకొన్న వ్యవహారంగా ఉండేది. మారుమూల ప్రాంతాల్లో ఉన్న కళాశాలల్లో ఇటువంటి సదస్సుల నిర్వహణ ఎంతో ప్రయాసతో కూడుకున్న వ్యవహారం. మరిప్పుడు ఇటువంటి వ్యయప్రయాసలేవీ లేకుండా కొన్ని వందల వెబినార్లు నిర్వహించబడుతున్నాయి. ఇటువంటి వెబినార్లలో విద్యార్థులు నిపుణులతో చక్కగా చర్చించి తమ సందేహాలను తీర్చుకుంటున్నారు. కానీ ఈ మార్పులన్నీ ఒక్క రోజులో సాధ్యం కాలేదు. గురువుల ఆన్‌లైన్ బోధనా నైపుణ్యాలను, విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను పెంచడానికి ప్రభుత్వం, విద్యావేత్తలు ఎన్నో పునశ్చరణ తరగతులను నిర్వహించడం జరిగింది. వివిధ స్థాయిల్లో ఉన్న అధ్యాపకులకు సాంకేతిక నైపుణ్యాలను మెరుగు పర్చుకోవడానికి కార్యశాలలు కూడా నిర్వహించడం జరిగింది.



ఈ సందర్భంగా ఆన్‌లైన్ బోధన సమర్థవంతంగా నిర్వహించడానికి కావాల్సిన కిటుకు తెలుసుకుందాం. మొదటగా ఆన్‌లైన్ బోధన సమర్థవంతంగా జరగాలంటే కావల్సినది సన్నద్ధత. తెర మీద గురువు కనిపించే తీరూ... తెన్ను బోధన పట్ల అతనికి ఉన్న నిబద్ధతను, అంకితభావాన్ని తెలియజేస్తుంది కాబట్టి ఈ విషయంలో గురువు ఆన్‌లైన్ ఎథిక్స్‌ను పాటించవలసిందే. విద్యార్థులకు కూడా ఈ ఆన్‌లైన్ ఎథిక్స్ గురించి ముందస్తుగానే అవగాహన కల్పిస్తే మంచిది. స్క్రీన్ ఎలా విద్యార్థులతో పంచుకోవాలి, ఏ వీడియోలను ప్రదర్శిస్తే విద్యార్థులకు విషయం పట్ల అవగాహన మెరుగవుతుంది అనే అంశాలను బోధన సమయంలో అధ్యాపకుడు పరిగణనలోకి తీసుకోవాలి. అదే విధంగా బోధన కొనసాగుతున్నప్పుడు ఇతర విద్యార్థులు చాట్ చేయకుండా, తమ స్క్రీన్‌ను పంచుకోకుండా కట్టడి చేసే నియంత్రణలు అన్ని ఆన్‌లైన్ వేదికల్లోనూ అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు ఉన్నత విద్యాలయాల్లో జీ సూట్‌ను ఉపయోగించి గూగుల్ పాఠాలు చెప్పడం జరుగుతోంది. జీసూట్‌లో ఈ పాఠాలను రికార్డు చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. ఎవరైనా విద్యార్థులు క్లాసుకు గైర్హాజరై ఉంటే వారితో ఈ అంశానికి సంబంధించిన లింక్‌ను పంచుకోవచ్చు. అదేవిధంగా అధ్యాపకుడు చెప్పిన పాఠాన్ని అధికారులు పర్యవేక్షించవచ్చు. సంప్రదాయక తరగతి గదిలో లాగా తీరుబడిగా బోధన సాగదీసే అవకాశం ఆన్‌లైన్‌లో ఉండదు కాబట్టి దీనికి తగ్గట్టుగా ప్రతి అంశానికి బోధనా ప్రణాళికను ముందుగానే ప్రతి అధ్యాపకుడు తయారుచేసుకోవాలి.

**ఒకప్పుడు అత్యుత్తమ విద్యాసంస్థలకు మాత్రమే పరిమితమైన ఆన్‌లైన్ బోధన నేడు గ్రామీణ విద్యాలయాల్లో కూడా కనిపిస్తోంది. విద్యార్థులు ఆన్‌లైన్ బోధనలో క్రియాత్మకంగా పాలు పంచుకోవడం వలన తమ సబ్జెక్టు పట్ల అవగాహన అంతర్జాతీయ స్థాయిలో పెంచుకోవచ్చు. ఎందుకంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విషయ నిపుణులతో ముఖాముఖి ఆన్‌లైన్ వేదికల ద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది. కాబట్టి చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నప్పటికీ రాబోయే తరాలు ఆన్‌లైన్ బోధనకు అలవాటు పడక తప్పదు. కాబట్టి అందరూ సమిష్టిగా ఆన్‌లైన్ నైపుణ్యాలు పెంచుకునే ప్రయత్నం చేద్దాం.**

ఆన్‌లైన్ బోధనకు ముందుగా పవర్ పాయింట్ స్లైడ్స్‌ను అధ్యాపకుడు తయారుచేసుకోవాలి. దీనికి గూగుల్ స్లైడ్స్‌ను ఉపయోగించవచ్చు. స్లైడ్స్‌ను 16:1 పరిమాణంలో తయారుచేసుకుంటే మొబైల్ తెర మీద చక్కగా, నిండుగా కనపడతాయి. వీలైతే ఈ స్లైడ్స్‌లోని చిత్రాలకు యానిమేషన్ జోడిస్తే విద్యార్థులకు పాఠం చక్కగా అర్థమవుతుంది. పవర్ పాయింట్ స్లైడ్స్‌లో ప్రతి అంశానికి సంబంధించిన శీర్షికను, ఉపశీర్షికలను పెట్టుకుంటే, బోధించే సమయంలో అంశాలు చక్కగా స్ఫురణకు వస్తాయి. పవర్ పాయింట్ స్లైడ్స్‌లోని చిత్రాలు, అంశాలకు కాపీ రైట్ సమస్యలు రాకుండా జాగ్రత్త పడాలి. ఈ స్లైడ్స్‌ను రూపొందించుకోవడానికి కావాల్సిన టెంప్లేట్లు బోలెడన్ని అంతర్జాలంలో అందుబాటులో వున్నాయి. పవర్ పాయింట్‌ను ఉపయోగించడం తెలుసుకుంటే ఆన్‌లైన్ బోధనలో ముందడుగు పడినట్టే భావించుకోవచ్చు.

స్క్రీన్ రికార్డింగ్ అనేది కూడా ఆన్‌లైన్ బోధనకు చక్కగా ఉపయోగపడుతుంది. ఫ్రీ కామ్, మోబిజాన్ లాంటి స్క్రీన్ రికార్డింగ్ యాప్‌లు దీని కోసం అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా అధ్యాపకులు వీడియో పాఠాలను రికార్డింగ్ చేసుకోవచ్చు. వీడియోల నిడివి తగ్గించడానికి, వాటిని కంప్రెస్ చేయడానికి ఎడిటింగ్ యాప్స్ కూడా అంతర్జాలంలో బోలెడు ఉన్నాయి. ఓపెన్ బ్రాడ్ కాస్టింగ్ స్టూడియో అనే సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్ బోధనను సుసంపన్నం చేయడానికి తగ్గ ఆప్షన్స్ ఉన్నాయి. అధ్యాపకులు తమకు నచ్చిన స్క్రీన్ రికార్డర్ ద్వారా వీడియో పాఠాలు తయారుచేసుకోవచ్చు. ప్రతి వీడియో పాఠం రికార్డు చేయడానికి ముందు అభ్యసన లక్ష్యాలను పేర్కొనడం మంచిది. అదే విధంగా ఆ అంశానికి సంబంధించి ఎటువంటి ప్రశ్నలు పరీక్షల్లో అడిగే అవకాశం ఉందో కూడా తెలియజేస్తే మంచిది. సిలబస్ బోధించడానికి ముందుగానే ప్రశ్నా పత్రం బ్లూ ప్రింట్ గురించి విద్యార్థులకు తెలియజేయాలి. సిలబస్ చివరలో ప్రశ్నల నిధిని విద్యార్థులకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడంతో పాటుగా సమాధానాలు ఏ ఫార్మేట్‌లో రాయాలో కూడా చెప్పడం శాస్త్రీయంగా ఉంటుంది. జీవ శాస్త్ర అధ్యాపకులు చిత్రాలను ఎలా వేయాలో ఆన్‌లైన్‌లోనే నేర్పవచ్చు. నిజానికి యూ ట్యూబ్‌లోని వీడియోలు సందర్భోచితంగా పంచుకో గలిగితే ఆన్‌లైన్ బోధన రక్తి కడుతుంది. గూగుల్‌తో పాటుగా జూమ్, టీచ్ మింట్ లాంటి వేదికలను కూడా ఉపయోగించవచ్చు. గూగుల్ క్లాస్ రూమ్‌ను ఉపయోగించి విద్యార్థులకు నోట్స్‌ను అందుబాటులోకి తేవచ్చు. ఆన్‌లైన్ పరీక్ష కూడా గూగుల్ ఫారమ్స్ ఉపయోగించి నిర్వహించవచ్చు. ఇలాంటి వివిధ పద్ధతుల ద్వారా ఆన్‌లైన్ బోధన చేయగలిగితే విద్యార్థుల హాజరు గణనీయంగా పెరుగుతుంది అనే మాట వాస్తవం. ఈ ఆన్‌లైన్ బోధనలో కొన్ని చిక్కులున్నది వాస్తవమే. వీటిని అధిగమిస్తూ మనం ఆన్‌లైన్ బోధన కొనసాగించాల్సిందే. తెలుగు మాధ్యమంలో టైపింగ్ కోసం గూగుల్ ఇన్ పుట్ టూల్స్‌ను వాడొచ్చు. లేదా స్పీచ్ టూల్ యాప్ ద్వారా నోట్స్‌ను సిద్ధం చేసుకోవచ్చు.

ఇక విద్యార్థుల వైపు కొన్ని ఇబ్బందులున్న మాట వాస్తవమే. సిగ్నల్స్ రాకపోవటంతో కొన్ని గ్రామాలలో విద్యార్థులు చెట్టెక్కిన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి సాంకేతిక సమస్యలను ఊరంతా కలిసి ఉమ్మడిగా పరిష్కరించుకోవాలి. విద్యార్థులకు మొబైల్స్ ఎక్కువగా చూడడం వల్ల కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఆన్‌లైన్ పాఠాలు వినేటప్పుడు మొబైల్‌ను సరైన దిశలో పెట్టుకుని వినాలి. ఆన్‌లైన్ పాఠాల కోసం మొబైల్ ఉపయోగించేటప్పుడు, విద్యార్థుల దృష్టి శృంగార వెబ్‌సైట్స్ వైపు మరలకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. లేదంటే తెర మీద పాఠాలు, తెరచాటు వ్యవహారాలకు దారితీస్తాయి. తమ పిల్లల బ్రౌసింగ్ హిస్టరీని అప్పుడప్పుడూ తల్లిదండ్రులు పరిశీలిస్తూ ఉండాలి. ఏది ఏమైనప్పటికీ విద్యార్థులు ఆన్‌లైన్ బోధనలో క్రియాత్మకంగా పాలు పంచుకోవడం వలన తమ సబ్జెక్టు పట్ల అవగాహన అంతర్జాతీయ స్థాయిలో పెంచుకోవచ్చు అనేమాట వాస్తవం. ఎందుకంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విషయ నిపుణులతో ముఖాముఖీ ఆన్‌లైన్ వేదికల ద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది. కాబట్టి చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నప్పటికీ రాబోయే తరాలు ఆన్‌లైన్ బోధనకు అలవాటు పడక తప్పదు కాబట్టి అందరూ సమిష్టిగా ఆన్‌లైన్ నైపుణ్యాలు పెంచుకునే ప్రయత్నం చేద్దాం.

- జీఎల్ఎన్ ప్రసాద్
9441450987